# తనలో తాను

(స్త్రీపాత్రలులేని చిన్ననాటిక)

రచన

డాక్టర్ కొ(్రపాటి గంగాధరరావు

బాపట్ల (గుంటూరు జిల్లా)

పబ్లిషర్సు

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో

రాజమండ్రి

సర్వహక్కులు
గ్రంథకర్తవి

వెల
1—8—0

మొదటి ముద్రణ
ఫిబ్రవరి 1957

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రా జ మ ం డ్రి

1000
ప్రతులు

# పాత్రలు

శంకరం—హోటల్‌లో ఒక సర్వర్.

చెన్నయ్య—శంకరం స్నేహితుడు.

రఘురాం—ఒక గొప్పింటి యువకుడు.

రాజారాం—రఘురాం స్నేహితుడు.

మరొక సర్వర్—

రంగాలంకరణ :—

చక్కని హోటల్ గది, ఒకప్రక్క టేబుల్, కుర్చీలు, Coat stand, రెండవప్రక్క Bed.

కావలసిన వస్తువులు :—

రఘురాం దగ్గర చదువుకునే పుస్తకం.

శంకరం దగ్గర కత్తి - రూపాయల మూటలు రెండు.

కాఫీకప్పులు - రెండు సెట్లు, ట్రే.


హెచ్చరిక

ఈ నాటికయొక్క సర్వహక్కులూ నాకు చెందియున్నవి. గాన దీనిని ఎవరు ఏవిధంగా ఉపయోగించుకున్నా ముందుగా నా లిఖితపూర్వకమైన అనుమతి పొందవలెను. అట్లు పొందకుండా ఉపయోగించుకొన్నవారిపై చర్య తీసుకొనబడును.

ఇట్లు

డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు

బాపట్ల (గుంటూరు జిల్లా)

# తనలో తాను - కొత్త ఉత్తరం

"తనలో తాను'' స్త్రీ పాత్రలులేని ఏకాంకిక. ఏకాంకికల్లో నే నెక్కువ హాస్యనాటికలే వ్రాశాను. హాస్యనాటిక వద్దనుకున్నవారి కిది అనుకూలమైన నాటిక. రంగస్థలంమీద కలలూ, ఊహలూ, ఆలోచనలూ ప్రదర్శించటం కష్టం. అటువంటి సన్నివేశాన్ని నడపటాని కిదొక పద్ధతి.

కొత్త ఉత్తరం మరొక హాస్యనాటిక. పెళ్లిచూపులు, కొత్తఉత్తరం, విధివశం ఈమూడు నాటికలనూ కలిపి నాటకంగా ప్రదర్శించుకోవచ్చు. రామం, రంగనాథం నాటకాలనూ....''ఇల్లా కలుపుకుని ప్రదర్శించే అవకాశంతో వ్రాయమ''ని చాలామంది మిత్రులు కోరుతున్నారు. కనక కొలది మార్పులతో ఈ వీలు కలిగేటట్లు సవరించి ప్రచురిస్తున్నాం.

బాపట్ల ఎగ్రికల్చరల్ కాలేజీ విద్యార్థులు యీ నాటకాలను ప్రథమంగా ప్రదర్శించారు. వారికి నా కృతజ్ఞత.

గ ం గా ధ ర రా వు.

# తనలో తాను

[ఒకానొక పట్నంలో, ఒక హోటల్ గదిలో, ఇద్దరు యువకులు 'పట్నం చూడటానికని వచ్చి - పట్నంలో చూసేదేం లేక' హోటల్ గదిలోనే వుండిపోయారు. మధ్యాహ్నం - మూడు గంటలయింది. హోటల్ చాలా చక్కగా వుంది. చక్కని కుర్చీలు టేబుల్ Fan లు పక్కలు వున్నాయి. అందులో ఒక యువకుడు రఘురాం - అతను ప్రక్కమీద పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటూ వున్నాడు. రెండవ యువకుడు రాజారాం. అతను ఏం తోచక గదిలో అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఇద్దరూ చక్కని దుస్తులు వేసుకుని 'పనిలేని గొప్పవాళ్ళ' లాగ కనిపిస్తారు.

తెర ఎత్తేసరికి రాజారాం గదిలో తిరిగి తిరిగి విసిగి అలిసిపోయాడు. ఎంతసేపటికి రఘురాం తన గాఢ గ్రహింపక పోవటం చూసి మరీ విసిగిపోయాడు. చివరకి ఆగలేక - గబగబా రఘురాం దగ్గర కెళ్ళి]

రాజా — ఒరేయ్! ఈ వూళ్ళో, ఈ హోటల్లో, ఈ గదిలో, ఇలా 'విశ్రాంతి' గడుపుతే - త్వరగానో - ఆలస్యంగానో మనకి పిచ్చి ఎక్కక తప్పదని నా వుద్దేశ్యం. ఏమంటావురా!

రఘు — ([illegible] - పుస్తకం మూస్తూ [illegible])

రాజా—జీవితంలో సరదా చచ్చిపోతే - ఈ వూళ్లో ఈ Hotel ల్లో, ఈ గదిలోనే కాక, ఏ వూళ్లో, ఏ గదిలో, ఏ మనిషికైనా-పిచ్చి ఎక్కక తప్పదని నేను Statement పారేస్తున్నాను. దానికి నువ్వేమంటావురా రఘురాం?

రఘు—(ఏమీ అనడు. చదువుకుంటూనే వుంటాడు)

రాజా—జీవితంలో చిత్ర విచిత్రమయిన సంఘటనలు, రక్తాన్ని వుత్తేజపరిచే సన్నివేశాలు, అధమం రోజు కొక్కటయినా జరక్కపోతే, జీవితం తుప్పుపట్టిపోతుంది- అని నేనొక Metaphor పారేశాను. అవునో - కాదో - చెప్పరా - చూద్దాం?

రఘు—(చెప్పడు. చూడడు)

రాజా—అటువంటి ఉత్తేజకరమైన సంఘటనలు, ఈ బూజు పట్టి పోతున్న జీవితాన్ని రోజూ మెలుపుతుండకపోతే జీవితం...(ఆలోచించి) జీవితం నీ మొహం లాగుంటుంది. Simily పారేశాను, మాట్లాడవేరా మొద్దూ.

రఘు—(మొహమెత్తి, చూసి, తిరిగి చదువు కుంటాడు)

రాజా—జీవితం ఒక రోజా మొక్కలాంటిది. దీన్ని రక రకాల ఎరువులువేశి, నీరు పోసి పోషించకపోతే వాడి ఎండి నశిస్తుంది, క్రమాలంకారంరా కరగత పుస్తక పర గత బుద్ధీ.

రఘు—(అతనివంక తల ఎత్తి అట్లాగే చూస్తాడు)

రాజా—అట్లా చూస్తావేం కళ్ళల్లో ఏం భావం కనిపించకుండా? (తల వంచుకుని రఘురాం మళ్ళీ చదువుకోబోతుంటే)

రాజా—ఓరేయ్ పుస్తకం మానేసి నాతో మాట్లాడకపోతే, అందరి సంగతలావుంచి – నాకిప్పుడు పిచ్చెక్కుతుంది. ఇక్కడున్నదే ఇద్దరం. నువ్వల్లా పుస్తకంలో మునిగిపోతే నన్ను దేంట్లో మునగమన్నావ్. మునక్కపోతే – ఇలా కూర్చుంటే–నాకేముంది ఆలోచటానికి? ఏం ఆలోచక ఎట్లా చావమన్నావ్ – బుర్ర మొద్దైపోతుంటే?

రఘు—అబ్బ. చాలా Dull గా వుందిరా.

రాజా—ఒక్క నిమిషం పుస్తకం ఆపితే నీకంత Dull గా వుంటే – గంటలకొద్దీ నువ్వల్లా చతువుతుంటే, – గంటలకొలదీ నేనిలా గదిలో పచార్లు చేస్తుంటే. నాకెల్లావుండాలి చెప్పు? జీవితంలో ఏ చలాకీ లేకపోతే Dull గా వుండదూ?

రఘు—జీవితం కాదురా – Dull గా వుంది.

రాజా—ఏమిటి మరి?

రఘు—పుస్తకంరా!

రాజా—పుస్తకం Dull గా వుందా! బాగుంది. అయితే ఈ ప్రచురణకర్తకి అన్నీ ఇలాంటి పుస్తకాలే ప్రచురించమని ఉత్తరం రాస్తాను. అప్పుడుగానీ పుస్తకాలనుంచి బయట

పక్షి - జీవితం ఎంత Dull గా వుందో తెలుసుకోక్.

రఘు—(మళ్ళీ చదువుకోబోతాడు)

రాజా —ఒరేయ్! Dull గా వుందంటూ మళ్ళీ పుస్తకం చదవన బోతావేంరా?

రఘు—చదవకపోతే మరీ Dull గా వుంటుందిరా.

రాజా—నువ్వు చదువుతుంటే నాకు Dull గా వుంటుంది.

రఘు—నే చదివితే నీ కొక్కడికే Dull గా వుంటుంది. చదవకపోతే నాక్కూడా Dull గా వుంటుంది.

రాజా—పుస్తకం Dull గానే వుంది గనక నీకు చదివినా Dull లే.

రఘు—జీవితం Dull; పుస్తకం Dull; నీతో మాట్లాడటం మరీ Dull.

రాజా—నువ్వు మరీ Dull చేస్తున్నావ్ రా. ఇంత Dull గా వుంటే చావ బుద్ధిపుట్టటంలేదూ? Dull గా ఈ ప్రపంచంలో ఇంతమందెలా బ్రతుకుతున్నారో?

రఘు—మనకి వేరింపనీ - వ్యాపారం లేదుగనకా, తిండికి సంపాదించుకోవాల్సిన అవుసరం లేదుగనకా, Dull అనిపిస్తుంది. కాని.........

రాజా—తిండికి సంపాదించాల్సిన అవుసరం వుందే అనుకో. ఉంటేమాత్రం? ప్రొద్దున్నే ఏదో వ్యాపారం, లేదా వుద్యోగం చేసుకోటం; సంపాదించటం; ... సంపాదించి తీసుకెళ్ళి పెళ్ళాం పిల్లల మొహానకొట్టి - ఇంత అన్నం

తినటం; నిద్రపోవటం; తిరిగి ప్రొద్దున్నే లేచి వుద్యోగం; తిండి - నిద్ర - మళ్ళీ ప్రొద్దున్నే ఉద్యోగం - తిండీ - నిద్రా - మళ్ళీ ప్రొద్దున్నే ఉద్యోగం - తిండి.........

రఘు—అబ్బ! జీవితాన్ని పుస్తకంలాగ. అంత Dull చేయకురా.

రాజా—Dull గాక ఏమిటోయ్! తల్చుకుంటే ఇప్పుడే చావాలనిపిస్తుంటే.

రఘు—చస్తే Dull గా వుండదంటావా?

రాజా—చస్తే వుండదు. కావాలంటే - తిరిగి బ్రతకగల్గితే - నేను రోజుకొకసారి చస్తాను - ఇలా Dull గా ఉండకుండా.

రఘు—కాస్త కాఫీ తెప్పించు; తాగితేనన్నా హుషార్‌గా వుంటుందేమో!

రాజా—(ద్వారందగ్గర కెళ్ళి) ఒరే, శంకరం - శంకరం - (శంకరం అనే హోటల్ సర్వర్ వస్తాడు)

రాజా—(సర్వర్‌తో) తొందరగా రెండు కాఫీ పట్టుకురా.

శంక—సరే సార్. (శంకరం వెళతాడు. వెళుతున్న శంకరాన్ని పరకాయించి చూస్తూ...)

రఘు—వాణ్ణి చూడు. వాణ్ణికోశినా నీకు జీవం కనిపిస్తుందీ? ఉత్త మొద్దు; రోజంతా ఆమూల కూర్చుంటాడు. ఎవరన్నా ఏదన్నా కావాలని పిలిస్తే - కదులుతాడు. లేకపోతే అదీ లేదు. ఏం బాగుందో వాడికీ జీవితం?

రాజా—మరే! మరో విచిత్రం ఏమిటంటే - వాడికా బండజీవితంలో విరక్తి లేదు. ఈ ప్రపంచమంతా తనది కానట్టే, తనకేమీ పట్టనట్టే. నిద్దరమత్తు జీవితం గడిపేస్తున్నాడు - ఈగదిలో. కుర్చీలాగ; ఆ పరంలాగ, అధమం - ఈ గడియారంలాగ "టిక్కూ టిక్కూ" మని కూడా అనడు - పోనీ - సినిమాకి వెళ్లామా ఏమిటి?

రఘు—ఎందుకూ? అక్కడా విశేషమేం జరగదుగా. అమ్మాయికోసం అబ్బాయి ఏడవటం! అబ్బాయికోసం అమ్మాయి ఏడవటం తప్ప...

(శంకరం కాఫీపట్టుకు వస్తాడు.)

రఘు—అక్కడపెట్టి పో. (శంకరం కాఫీగ్లాసు లక్కడపెట్టి వెళతాడు)

రాజా—వీడిలో కాస్తన్నా చలనం కనిపించదేంరా! ఒక Machine లాగా.

రఘు—ఒక్క వీడేమిటబ్బాయ్ - ? మనం రోజూ ఎంత మందిని చూస్తున్నాం - వీడిలాగ. బీదవాళ్ళనీ - గొప్ప వాళ్ళనీ ఎంతమందిని? మానవుడు పుట్టి ఎన్ని వందల ఏళ్ళయిందోగాని, పుట్టినప్పట్నించీ చచ్చే దాకా, పెట్రోలు వగైరాలు లేకుండా - ఇంత తిండి తిని పనిచేసే యంత్రాలు. అంతే.

రాజా—అవును. రామాయణ - భారతయుద్ధాలు రోజూ జరగవ్ గా?

రఘు—అవ్వీ పుస్తకాల్లో జరిగినవేగా ? ఒక వేళ నిజంగా జరిగినవే ననుకో. అవ్వీ రోజుకొకటి జరుగుతుంటే సరదా చచ్చి Dull గా జరుగుతాయి.

రాజా—మరే World War రెండోసారి జరిగేటప్పటికి - Dull గా ఏడేళ్ళు - తీసుకుంది.

రఘు—నువ్వన్నట్లు ఏదో ఒకసారి భారత, రామాయణ యుద్ధాలు జరగాలంటే - అతి చురుకైనవాడెవడో ఒకడు; "రావణాసురుడో, దుర్యోధనుడో" పుట్టాలి. లేకపోతే రాముడు పుట్టీ లాభం లేదు - అర్జునుడు విల్లంబులు పట్టీ లాభం లేదు. (కాఫీ కప్పులు తీసుకెళ్ళటానికి శంకరం వచ్చి తీసుకుని పోబోతాడు.)

రాజా—కాస్త గమ్మత్తు చేద్దామాగు. ఒరేయ్ - శంకరం! మాట ? (శంకరం వెనక్కి వచ్చి నుంచుంటాడు)

రాజా - నువ్వెన్ని రోజులయింది పుట్టి ?

శంక—తెలియదండీ !

రాజా—నువ్వెప్పుడు పుట్టావో తెలీదూ ?

శంక— తెలియదు.

రాజా—పోనీ - నీ కెన్నేళ్ళు వుంటాయి. షుమారు ?

శంక—(ఆలోచిస్తాడు)

రాజా—ఆలోచిస్తావేంరా ? ఇదివర కెప్పుడూ ఎన్ని ఏళ్ళుంటాయో ఆలోచించుకోలే ?

శంక—లేదు - గాని, ముప్పై ఏళ్ళుంటా యనుకుంటా.

రాజా—ఈ ముప్పై యేళ్ళూ ప్రపంచంలో వుండి ఏం చేశావ్ ?

శంక—ఏం చేస్తానూ ?

రాజా—ఏమీ చెయ్యకుండా ముప్పై యేళ్ళు ప్రపంచంలో ఎల్లా వున్నావురా ?

శంక—వేరే ఏం చేస్తానండీ ? అందరూ ఏ చేస్తున్నారో నేనూ అదే చేస్తున్నాను.

రాజా—అందరూ ఏం చేస్తున్నారో, నువ్వూ అదే చేస్తున్నావ్. నువ్వేం చేస్తున్నావో - ఊళ్ళో పిండిమరా - అదీ చేస్తూంది ?

శంక—అదేమిటండీ ?

రాజా—అదే ఇవ్వాళ నేను కనిపెట్టింది. నువ్వు పిండిమరవి కావుగాని, వేరే ఒక రకం మరవి. మర - ఏంచేస్తుంది? దాని పని అది చేస్తుంది.

శంక—మనుష్యులు మాత్రం, వాళ్ళపని వాళ్ళు చెయ్యక, ఇంకొకళ్ళ పని చేస్తారటండీ ! (ఆలోచించి) అవును, చేస్తారులెండి నా బోటివాళ్ళు.

రాజా—చూశావా ? కాబట్టి నువ్వూ ఒక మరవి. ఎలాంటి మరవో చెప్పనా ?

శంక—ఆ.

రాజా—రెండు కాళ్ళు, ఒక నోరూ...ఎంత ?

శంక—(మాట వినకుండా గబగబా తీసుకురావటానిగా వెళ్ల బోయి, అనుమానించి, తిరిగి వచ్చి) ఇండ్లీ...సాంబారా? చట్నీయాండీ ?

రాజా—ఆగవోయ్...నిన్ను తెమ్మంటం లేదు ఖరీదు లడుగుతా? చెప్పు ?

శంక—రెండు ఇడ్లీ...కాఫీ...పావలా.

రాజా—ఒక ఇడ్లీ...రెండు పెసరట్ ఒక కాఫీ - ఎంత ?

శంక—ఏడణాలు.

(శంకరానికి రెండువైపులా ఇద్దరూ చేరి అడుగుతారు)

రాజా—రెండు యిడ్లీ. వక పెసరట్, రెండు మినపట్ ఒక కాఫీ - ఎంత ?

శంక—పదణాలు.

రాజా—స్వీట్...పెసరట్...కాఫీ...?

శంక—ఏడణాలు.

రాజా—రెండు స్వీట్ - రెండు పెసరట్ - కాఫీ ?

శంక—పధ్నాలుగణాలు.

రాజా—చూశావా నే నైతే ఒక్కొక్క దానికి అయిదు నిమిషాలు తీసుకునేవాణ్ణి నువ్వో Machine Caliculating Mechine

శంక—మిషన్నా ! నేను మిషన్నా ? అవును. మిషన్నే.

రాజా—సరే ఫో. - నిన్ను చూస్తుంటే మరీ విసుగెత్తుతుంది. (శంకరం వెళ్తాడు) ఎట్లారా మనమేగో ఒకటి చెయ్యాలి.

లేకపోతే లాభం లేదు. ఏదోవకటి చెయ్యకపోతే ఈ ఊళ్ళో. ఈ Hotel లో. ఈ గదిలో - మనిద్దరికీ పిచ్చెత్తిపోతే ఎవరి బాధ్యతా వుండదు.

రఘు—(లేచి) పద. ఊళ్ళోకి వెళ్ళి - ఏదో వకటి చేద్దాం - చెయ్యందే తిరిగి రావద్దు.

రాజా—ఏం చేద్దాం?

రఘు—ఏదో ఒకటి. ఏదైనా సరే. రోడ్డు వెంట వెళ్దాం. సరదా అయినపని చూద్దాం. చేసేద్దాం. తర్వాత ఏమైనా కానీ...

రాజా—పద.

[ఇద్దరూ గబగబా కోటూ అది తగిలించుకుని వెళ్ళటానికి తయారవుతారు. శంకరం ఎదురు పడుతాడు]

శంక—మీరు ఎక్కడికన్నా వెళ్తున్నారాండీ?

రాజా—అడిగావ్!

రఘు—ఏం? అంత ఖంగారు పడుతున్నావ్?

శంక—ఏం లేదండీ. ఏం లేదు.

రాజా—ఏమిటా ఖంగారు?

శంక—ఏం లేదు - వస్తాను.

రాజా—ఏమిటోయ్. - చెప్పు ఫర్వాలేదు.

శంక—మీరు మళ్ళీ ఎన్నింటికి వస్తారు?

రాజా—ఇన్నింటికని చెప్పలేం గాని, చీకటి పడకుండా వస్తాం.

శంక—మీ గది తాళం చెవ్వి నాకిచ్చి వెళ్తారా?

రాజా—తాళం చెవ్వి - నీకిచ్చి వెళ్ళమంటావా?

శంక—అవునండీ...

రాజా—అవునా!

శంక—అవునండీ - మరేం లేదు; మా స్నేహితుడొక డొస్తాడు. వాడితో కాసేపు కూర్చుని మాట్లాడాలి - రహస్యంగా. అందుకు అడుగుతున్నా. అంతే, మీకేమీ ఫర్వాలేదు.

రాజా—ఊఁ. (అల్లాగా అన్నట్టు అని ఆలోచిస్తాడు)

రఘు—ఊఁ? (ఏమంటావ్ అని రాజారాంను ప్రశ్న వేసినట్టు అంటాడు)

రాజా—ఊఁ (ఒప్పుకుందాం అన్నట్టు అంటాడు) సరే, మేం వెళ్తాం. రెండు గంటల్లో వచ్చేస్తాం. ఈలోపున నీ రాచ కార్యం కానియ్యి. తర్వాత "ఇంకా అవలేదండీ కాస్త అవతలే నుంచోండి" అనకు. పదరా రఘూ. (ఇద్దరూ కోట్లు తగిలించుకు వెళ్తూ)

రాజా—నాలుగుగంటలయింది. ఆరు గంటలకి తిరిగివస్తాం. గది జాగ్రత.

శంక—ఆ.

(ఇద్దరూ వెళ్ళారు. శంకరం ఆలోచిస్తూ కూర్చుంటాడు కొంత సేపయిన తర్వాత - కత్తి తీసి చూసుకుంటాడు. ఏదో ఆలోచించి కత్తి దాచేస్తాడు. మళ్ళీ ఆలోచిస్తూ కూర్చుంటాడు. లోపల్నించి "శంకరం శంకరం" అని కేకలు విన్పిస్తాయి.)

శంక—ఆ - రా -

[మరొక సర్వరు లోపలికి వచ్చి]

సర్వర్—నీకోసం ఎవరన్నా వస్తే చెప్పమన్నావుగా?

శంక—ఆ. వచ్చాడా? (ఆదుర్దాగా) చిన్న మీసాలున్న వాడేనా?

సర్వర్—ఆ.

శంక—మొహం మీద మచ్చవుందా?

సర్వర్—ఆ.

శంక—లోపలికి రమ్మను.

సర్వర్—ఆ. (వెళ్ళబోగా)

శంక—ఒరేయ్ - మాట. వాడితో నేను రహస్యంగా మాట్లాడాలి.

సర్వర్—ఆహా.

శంక—కాస్త నువ్వా పెద్దతలుపుదగ్గరుండి ఎవ్వరూ ఇటు రాకుండా చూడు.

సర్వర్—ఆ.

శంక—నువ్వూ లోపలిక రాక.

సర్వర్—ఆ. (సర్వర్ వెళతాడు)

[శంకరం తలవంచుకు కూర్చుని వుంటాడు. ఒకసారి అదిరిపడి తలెత్తి చూస్తాడు. తలుపుదాకా వెళ్ళి చూచి తిరిగి వచ్చి కూర్చుంటాడు. లోపలికి మరో వ్యక్తి వస్తాడు]

వ్యక్తి—ఏం శంకరం కులాసాగా వున్నావా?

శంక—వచ్చావ్?

వ్యక్తి—ఆ - వచ్చాను - రమ్మన్నావుగా?

శంక—వచ్చావ్ - శనిలాగ!

వ్యక్తి—ఆమాట అంటావ్ అని నాకూ తెల్సు. తెలిసే వచ్చాను. కాని త్వరగా తేల్చు, ఇక్కడే కూర్చోటానికి తీరుబడి లేదు.

శంక—తీరుబడి వస్తుందిలే.

వ్యక్తి—ఏమిటి? అదోమాదిరి మాట్లాడుతున్నావ్?

శంక—మాట్లాడుతున్నాను, ఆశ్చర్యంగావుందా చెన్నయ్యా? జ్ఞాపకం తెచ్చుకో - ఇంతవరకూ నన్నిలా వేధించావో.

వ్యక్తి—ఏమంటావ్?

శంక—ఏమంటాను. అయిదేళ్ళనించీ నన్ను ఎన్నోయాతన్లు పెడుతున్నావ్. నాకుటుంబాన్ని చెల్లాచెదరు చేశావ్. చివరకి నేనివ్వాళ్ళో హోటల్లో చేరి గుట్టుగా పొట్టపోసుకుంటుంటే నన్నింకా పట్టుకు వదలకుండా వెతుక్కుంటూ వచ్చావ్.

వ్యక్తి—బ్రతకదల్చుకున్న తర్వాత బాధలు తప్పవ్.

శంక—బాధపడటానికి నాతప్పేమిటి చెన్నయ్యా? ఇప్పటికన్నా జాలిదల్చి నన్ను వదిలిపెట్టు. నీవల్ల నాజీవితం, నాశనమయిపోతూంది.

వ్యక్తి—నావల్ల అంటావేమిటి? మధ్య నే నేంచేశాను?

శంక—వేరేం చెయ్యాలి? చేసిందంతా నువ్వేగా?

వ్యక్తి—నేను కాదు, నీప్రాణాలమీద తీపివల్ల జీవితాన్ని చేతుల్లో కోసుకోలేక, నీజీవితాన్ని నువ్వే నాశనం చేసుకున్నావ్?

శంక—కాదు. నువ్వే నాశనంచేశావ్! పండులాంటి నా కాపురం బూగ్గులుచేసింది నువ్వు - నాచెల్లెలు ఉరిపోసుకు చచ్చింది - నీవల్ల. నేనిట్లా పరారీ అయి దేశాలవెంట తిరుగుతున్నది - నీవల్ల. నాతండ్రి అక్కడ దిక్కులేని చావు చచ్చింది - నీవల్ల.

వ్యక్తి—ఎవరేం చేసినా, నేరంచేసినవాడు శిక్ష అనుభవించాలి. కోపంలో హత్యచేస్తే వురితాడు, నిమ్మదిగా బిగవదు.

శంక—చెన్నడూ?

వ్యక్తి—శంకరయ్యా! కేకవేస్తే నీగుట్టు నువ్వే బైటపెట్టుకుంటావ్, కోరి వురితాడు కంఠానికి తెచ్చుకోకు. పదిహేను నిమిషాల్లో పోలీసులొచ్చి పట్టుకుంటారు. తెలుసుగా! పది ఏళ్ళనించీ పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

శంక—అయితే!

వ్యక్తి—అయితే లేదు - గియితే లేదు, తే - వందా రూపాయిలూ.

శంక—ఇస్తాను; కాస్త కూర్చో కాఫీతాగి పోదువుగాని, కూర్చోమరి - ఈ వందేనా - మళ్లీ ఇంకో అవసరానికి, ఇంకో వంద అడుగుతావా? ...

వ్యక్తి—అప్పే అడగను; ఇక అడిగితే అప్పూకను.

శంక—ఇదివరకు అయిదు వందలిచ్చాను. ఆనాడూ "ఇంక అడిగితే అప్పడను" అనే అన్నావ్.

వ్యక్తి—అవును ఇన్నాళ్ళూ నేనూ అడగ లేదుగా!

శంక—అడగ లేదు. అయిదు సంవత్సరాలయింది. అయిదేళ్లయినా వెంట తరుముతూనే వున్నావ్. చెన్నయ్యా! నా దగ్గరడబ్బుంటే ఎల్లాగో అల్లా ఉరిశిక్షేతప్పించుకు పోయే వాణ్ణి.

వ్యక్తి—అయితే ఇంతకూ "డబ్బులేదు పో" మ్మంటావా ఏం ?

శంక—అనను, డబ్బులేదంటే - పోలీసులకు వప్పజెపుతావ్. నాకు తెల్సు; పోలిసులింకా నాకోసం వెతుకుతూనే వున్నారు. అందుకనే చదివిన చదువుకూడా మరచిపోయి మారువేషంలో ఈ Hotel ల్లో చేరి దొంగబ్రతుకు బ్రతుకుతున్నాను.

వ్యక్తి—అయితే ఏమంటా వింతకూ ?

శంక—ఏం లేదు. కాఫీ తెప్పిస్తాను - తాగుదువుగాని; ఒరే కైలాసం - కాఫీ తీసుకురారా - ఆ. కాసేపు కూర్చో, నిన్ను బ్రతిమాలుకుంటాను. ఇకనన్నా నన్ను విడిచి పెట్టు. నా బ్రతుకు నన్ను బ్రతకనియ్యి తడవ తడవకీ వంద కావాలంటే - నేనెక్కణ్ణించి తేను? కనకే నిన్ను బ్రతిమాలుకుందామని కూర్చోపెట్టాను, కైలాసం! కాఫీ పట్టుకురాడేం ఇంకా!

(తనే లోపలికి వెళ్ళి కాఫీ తీసుకువస్తాడు.)

శంక—నువ్వు పంచదార ఎక్కువ వేసుకుంటావుకదూ ? ఇదిగో పంచదార.

(కాఫీలో పంచదారలాంటి తెల్లని పొడి కల్పుతాడు)

వ్యక్తి—ఆ...అది...పంచదారేనా ?

శంక—ఆ...పంచదారే- (కాఫీ గ్లాసు ఇస్తాడు)

వ్యక్తి—ఊఁ (కాఫీగ్లాసు చేతిలో పట్టుకుని (తాగకుండా) మరి...వందరూపాయలు ఏవీ ?

శంక—ఇస్తాను; కాఫీ తాగు యీలోగా.

వ్యక్తి—ఇయ్యి ముందు; వంద చేతికిస్తేగాని కాఫీ తాగను.

శంక—ఇవిగో...తీసుకో.

(వందరూపాయల కట్ట చేతి కివ్వగా చెన్నయ్య తీసుకుని)

వ్యక్తి—సరే...ఇక నే వస్తా-

(కాఫీ గ్లాసుతో కూండా వెళ్ళబోతాడు)

శంక—అదేమిటి ? కాఫీ తాగకుండా- ఆ గ్లాసు...

వ్యక్తి—కాఫీ! కాఫీలో విషం ! మోసం! బట్టబయలు! శంకరం! నా మీద నీ ప్రేమ అంతా చూపించవద్దులే. నా దగ్గర యీ ఎత్తులు సాగవ్.

శంక—అదేమిటి ! నిన్ను బ్రతిమాలుకోవాలనీ; నీతో తీరుబడిగా మాట్లాడాలనీ, నేను కూర్చోబెట్టాను.

వ్యక్తి—చాల్లే; ఈ కల్లబొల్లి కబుర్లు. నేన్ని స్నేహితుణ్ని గదా అని ఇక్కడకొచ్చాను. స్నేహితుడికి కాఫీలో

కటిక పాషాణం కలిపావ్. ఈ కాఫీలో ఏం కలిపావో నే కనిపెట్టలేననుకోకు. తీసుకెళ్ళి నీ బండారం బట్ట బయలు చేస్తాను. వెనకటి దొంగ కేసు; ఇది మరొకటి; పోలీసులు ముందు నిన్నరెస్టు చేసి దీన్లో ఏముందో పరీక్ష చేస్తారు. పారిపోవటానికి వెంటనే బండీ, బస్సూ దొరకవులే.

శంక — చెన్నయ్యా!

వ్యక్తి — వస్తాను; తొందరగానే వస్తాను. (నవ్వుతాడు) నన్ను మోసం చెయ్యాలనే?......(వికృతంగా నవ్వుతూ పోబోగా)

శంక — చెన్నయ్యా! ఆగు.

వ్యక్తి — ఎందుకాగాలి? విషం పెట్టి చంప చూసినందుకా?

శంక — కాదు.

వ్యక్తి — మరెందుకా రెండువందలిస్తావా?

శంక — మళ్ళా రెండు వందలా?

వ్యక్తి — ఆ... రెండు వందలిస్తే, ఈ మోసాన్ని బయట పెట్టను. లేకపోతే సరాసరి వెళ్ళి Police Report యిస్తాను.

శంక — ఆగు... వెళ్ళొద్దు... ఆగు.

వ్యక్తి — మరి రెండు వందలు పడెయ్యి.

శంక — లేవు.

వ్యక్తి — అయితే కానీ! నన్ను నువ్వు, మోసం చెయ్య లేవు. నేనేం తెలికి తక్కువవాణ్ణి కాదు. (నవ్వి) నేనేం తెలివి

తక్కువవాణ్ణిగాదు. (నవ్వి) నేనేం తెలివి తక్కువవాణ్ణి గాదు (నవ్వుతూ వెళ్ళిపోతాడు)

శంక—(బిగ్గరగా) వద్దు...వద్దు వద్దు. మోసం చెయ్యను. నువ్వేం తెలివి తక్కువవాడివి కాదు- నువ్వేం తెలివి తక్కువవాడివి కాదు- నువ్వేం తెలివి తక్కువవాడివి కాదు. (స్వరం క్రమంగా తగ్గుతుంది. వణికిపోతుంటాడు. సర్వరు గబగబ వస్తాడు)

సర్వర్—ఏమిటి శంకరయ్యా! గదిలో కూర్చుని - నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావ్.

శంక—ఆ! వాడొచ్చాడా?

సర్వర్—ఎవరూ - మీవాడా? రాలేదే యింకా?

శంక—అయితే - నువ్వెందుకు వచ్చావ్?

సర్వర్—నువ్వేదో గట్టిగా కేక లేస్తుంటేనూ "ఏమిటా" అని చూట్టానికి వచ్చాను.

శంక—ఏం లే; నువ్వుపో; వాడొస్తే ఇక్కడికి పంపించు.

సర్వర్—అల్లాగే; కాని ఎవరతను?

శంక—ఒక స్నేహితుడు, ఊ - అంతా - తర్వాత చెప్తాలే; నువ్వు పో.

సర్వర్—వెళ్తాగాని - పిచ్చి కేకలు మళ్ళీ వెయ్యకు-ప్రక్క గదిలో వాళ్ళు అదిరిపోగలరు! వస్తా (పోతాడు)

శంక—అమ్మయ్య...

[ఏం చేయటం తోచక అటూ ఇటూ తిరుగుతాడు- తలఎత్తి, తెల్లబోయి, ఆగుతాడు. వ్యక్తి తిరిగి వస్తాడు]

శంక—ఎవరది?

వ్యక్తి—నేనే!

శంక—వచ్చావ్?

వ్యక్తి—వచ్చాను. కాని త్వరగా వెళ్ళాలి; ఆ - నే నొచ్చిన పని తెల్సుగా!

శంక—ఆ తెల్సు! నా సొంతూరు పీల్చుకు తాగటానికి!

వ్యక్తి—ఏమంటావ్!

శంక—అహాహా! ఏం లేదు; కూర్చో; ఇట్లా కూర్చో.

వ్యక్తి—ఆ కూర్చోటాని కేంలే! నే వెళ్ళాలి; ఆ డబ్బు సిద్ధం చేశావా?

శంక—చేశాను. ఇస్తాను; కాని ఇల్లా సన్నింతవరకు బాధిస్తావ్?

వ్యక్తి—నేనేం బాధించాను? నువ్వీ హోటల్కొచ్చి తల దాచుకున్నావని, నాకు రెండేళ్ళ క్రిందే తెల్సు. కాని నిన్నేమన్నా బాధించానా? డబ్బు చాలా అవసరమయింది; మరో విధంలేక నీ దగ్గరకొచ్చాను. ఊ, డబ్బు సిద్ధంచేశావా?

శంక—లేదు; డబ్బు సిద్ధం చేయలేదు; డబ్బు నా దగ్గర లేదు.

వ్యక్తి—అయితే ఎందుకు రమ్మని ఉత్తరం వ్రాశావ్!

శంక—వ్రాశాను.

వ్యక్తి—ఇవ్వనని వ్రాస్తే సరాసరి - పోలీసుల్నే తెచ్చేవాణ్ణిగా!

శంక—చెప్పనయ్యా!

వ్యక్తి—మించిపోయిందేం లేదు; పదినిమిషాల్లో......

శంక—చెప్పనయ్యా!

వ్యక్తి—ఈలోపున హోటల్ దాటిపోయినా, ఊరు దాటి పోలేవులే. స్టేషన్, బస్‌స్టాండు కనిపెట్టి వుంటా...

శంక—చెప్పనయ్యా!

వ్యక్తి—కోపం వస్తే, కళ్ళురిమితే, భయపడి పారిపోతా ననుకొన్నావా? వస్తా; పదినిమిషాల్లో-ఆఖరిసారి అడుగు తున్నాను; - ఏం?

శంక—ఇవ్వను.

వ్యక్తి—అయితే వెళ్ళొస్తాను.

శంక—ఊఁ...

వ్యక్తి—సరే; కాని...

[వెళతాడు; శంకరం కత్తితీసి గబగబా లోపలికి వెళ తాడు; లోపల్నించి కెవ్వనకేక; భయంతో వణికిపోతూ శంకరం లోపలికి వస్తాడు; కాసేపటికి - బయటగోల, కేకలు ప్రారంభమవుతాయి]

ఒకటవ కంఠస్వరం—ఇదేమిటి?

మరొక కంఠస్వరం—ఎవరది?

మూడవ కంఠస్వరం—ప్రాణంపోయింది!

ఒకటవ—పట్టపగలు! హత్య!

[శంకరం వణికిపోతూ కూర్చుని తల చేతుల్లో దాచు కుంటాడు]

రెండవ—ఎవరో హత్య చేసి పారిపోయారు!

మూడవ—వెతకండి? చంపినవాడెక్కడో దాక్కుని వుంటాడు.

అందరూ—వెతకండి! వెతకండి...!

మూడవ—ఆగది చూశారా! ఈగది పదండి చూద్దాంపద.

ఒకటవ—ఈగదిలో వెతకలేదు...ఈగది వెతకండి.

రెండో—జాగ్రత్తగా లోపలికి వెళ్ళండి; వాడిదగ్గర - కత్తి వుంటుంది.

మూడవ—ఎవరన్నా ఒకడు పోలీసులదగ్గరికి పరుగెత్తండి. పోలీసులొచ్చేదాకా ఎవ్వరూ కదలొద్దు.

రెండవ—ఈగదిలోనే వుంటాడండీ, తక్కినగదులు తెరిచే వున్నాయి.

నాల్గవ—అందరం పోదాం గదిలోకి - అందరం కల్సి పట్టుకుందాం వెధవని -

రెండ—పదండి - లోపలికి; అందరూ పదండి.

(బయట గోల ఎక్కువవుతుంది)

.. క—(తల ఎత్తి - బిగ్గరగా) వద్దు. నేనాపని చెయ్యలేను; ఆపనిమాత్రంవద్దు. ఒకసారి చేసినతప్పే తిరిగిచేసి తప్పించుకోలేం; ఆపని అసలు వద్దు; ఆపని అసలొద్దు. (బల్లదగ్గరకెళ్ళి కూర్చుంటాడు, బయటనించి సర్వేన్ కేకలు వినిపిస్తాయి; శంకరం స్వరం క్రమేపి తగ్గుతుంది. వణికి పోతూ కూర్చుంటాడు)

సర్వాన్—శంకరం! శంకరం! ఏమిటయ్యా! వంటరిగా ఈ గదిలో కూర్చుని పూరికే కేకలేస్తావ్!

శంక—ఆ!

కైలా—ఏమిటి- అలావుంది మొహం! ఏం చూసి - ఆ భయం!

శంక—ఏం లేదు!

కైలా—ఏం లేదూ? నీడ చూసి, అదిరిపోతూ - ఏం లేదంటావేం?

శంక—ఏం లేదు; మా వాడింకా రాలేదుగా? వాడికోసం కూర్చుని ఆలోచిస్తూ, నన్ను నేనే మర్చిపోయాను.

కైలా—ఎవరేం ఆయన?

శంక—స్నేహితుడులే!

కైలా—స్నేహితుడా!

శంక—అదే! ఒక స్నేహితుడు.

కైలా—అయితే మంచి స్నేహితుడే! ఎన్నాళ్ళ నించీ స్నేహం!

శంక—అదంతా తర్వాత చెప్తాలే; వస్తే - వాణ్ణి లోపలికి పంపు.

కైలా—అట్లాగే - వస్తా... (వెళ్ళబోగా)

శంక—కైలాసం...!

కైలా—(ఆగి) ఆ...

శంక—మాట! కాస్త సలహా చెప్పు.

కైలా—ఏమిటి ? (దగ్గర కొస్తాడు)
శంక—(దీనంగా) నీకో స్నేహితుడున్నా డనుకో.
కైలా—ఆ...
శంక—వాడు పరమ దుర్మార్గు డనుకో.
కైలా—ఊఁ...
శంక—వాడు స్నేహంగా దగ్గర చేరి, నీ చెల్లెల్ని మోసం చేసి చెడగొట్టాడనుకో; ఊళ్లోవాళ్ళు పదిమందీ అనే పోడుపు మాటలు భరించలేక - మతిచెడి, తండ్రి మంచాన బడ్డాడనుకో; నీ చెల్లెలిని పిలుచుకు కెళ్ళటానికి స్నేహితుడు, ఇంట్లో కొచ్చాడనుకో - ఏం చేస్తావ్ నువ్వు ?
కైలా—పొడిచి చంపేస్తాను.
శంక—వద్దు. కైలాసం! వద్దు; చంపితే పోలీసులు వెంట బడ్తారు.
కైలా—అయితే వాడేనా - ఈ స్నేహితుడంటూ వచ్చే వాడూ ?
శంక—కాదు.
కైలా—మరేమిటి ? ఇట్లా అడిగావ్ !
శంక—ఎట్లా అడిగాను ?
కైలా—నువ్వడిగేది కథా? నిజమా ?
శంక—నిజమే. సహించలేక నా చెల్లెలే వాణ్ణి చంపింది. అర్ధరాత్రి చంపిన శవాన్ని తీసుకుపోయి పూడ్చాలని నేను ప్రయత్నించాను. ప్రయత్నంలో మరో స్నేహితుడి

కట్టబడ్డాను వాణ్ణి బ్రతిమాలుకున్నాను; ప్రాధేయపడి సహాయమడిగాను; సహాయం చేశాడు; పని పూర్తిచేసి ఇంటికొచ్చేసరికి, చెల్లెలు వురిపోసుకుని ప్రాణం విడిచింది. ఎదురుగా నా స్నేహితుడున్నాడు, రెండు హత్యలూ నా మీద నిందమోపి, తను సాక్ష్యమిస్తానని ఈ స్నేహితుడు బెదరించాడు. వెయ్యిరూపాయిలు నెంటనే కక్కితే పారిపోవటానికి దారి చూపిస్తానని ఆశపెట్టాడు. వెయ్యి రూపాయిలే కాదు. నా ఆస్తంతా వాడికే వదులుకుని, పారిపోయి బయటపడ్డాను. మంచాన వున్న మా నాన్న మరణించాడు – కాని ఈ స్నేహితుడింకా నన్ను అంట కాగే వస్తున్నాడు.

కైలా——అహా! వాడొస్తున్నాడా ఇక్కడికి?

శంక——నే నెక్కడుంటే అక్కడికే వస్తున్నాడు – నే నేవూరి కెళ్తే అక్కడిక వస్తున్నాడు; వచ్చినపుడల్లా, ఉన్న డబ్బంతా ఊడ్చుకుపోతున్నాడు.

కైలా——వెధవ!

శంక——గట్టిగా అరవకు; వాడు వచ్చి వింటాడేమో, కండలు కరిగించి, పోసి – చాకిరీచేసి, వాడు కంటపడేటప్పటికల్లా– కట్టగట్టి చేతులో పెడ్తున్నాను అయిదు సంవత్సరాల బట్టీ...జలగలాగా పట్టుబట్టి వాడు నెత్తురు పీలుస్తున్నాడు

కైలా——వెధవను రానీ...చితకపొడుద్దాం.

శంక——ఆ పనివద్దు; వాణ్ని చంపితే తప్పించుకుపోవటమెట్లా? మళ్ళీ పోలీసులు; – మళ్ళా కేసులు, మళ్ళా ఉరితాడేగా.

కైలా—మరి...ఏం చేస్తావ్ ?

శంక—వాడు డబ్బడుగుతాడు; ఇచ్చేస్తాను; తర్వాత...

కైలా—తర్వాత......

శంక—మళ్ళా మరో వూరు పారిపోతాను.

కైలా—ఊఁ.

శంక—వెళ్ళు; మనసులో దాచుకోలేక చెప్పేశాను. ఇది ఎవరితో చెప్పకు; వెళ్ళు; వాడొస్తే లోపలికి పంపు.

కైలా—సరే వెళ్తా; కావాలంటే నన్ను పిలు; కనుక్కుందాం వాడి సంగతి, (వెళ్తుంది)

(తిరిగి తల చేతుల్లో పట్టుకు కూర్చుంటాడు, లోపలినుంచి వ్యక్తి కంఠస్వరం)

వ్యక్తి—శంకరం! శంకరం!

[శంకరం అదరిపడి లేచి వెనక్కి వెనక్కి పోతాడు; వ్యక్తి ప్రవేశిస్తాడు)

వ్యక్తి—ఓ! ఉన్నావుగదా? పక్కపోతే - ఎవరూ లేరనుకున్నా; ఆ...కాబట్టే - తగు ప్రయత్నంలో నే ఉన్నానన్నమాట.

శంక—ఆ...?

వ్యక్తి—ఆఁ. ఏంలే. ఇదివరకు ఇల్లే "ఇవ్వాళా రేపూ" అనకుండాం, తొందరగా...పంపుతావా అని!

శంక—ఆ; దేన్నిగురించి! ఇంకా నన్నెన్నాళ్ళిట్లా దుంప తెంపుతావ్ ?

వ్యక్తి—దుంప తెగగొట్టావ్ ఏముంది? నేనడిగింది పదరూపాయిలు. అదీ - రెండు సంవత్సరముల తర్వాత.

శంకర—ఆ!

వ్యక్తి—ఆమాత్రం సంపాదించటం లేదూ నువ్వు! సంపాదిస్తూ - నేచేసిన సహాయానికి, ఇబ్బందిలో నాకు సాయం చెయ్యటానికి - ఇదవుతావేం?

శంకర—ఆ?

వ్యక్తి—నే నాగొడు సహాయమే చెయ్యకపోతే, ఈపాటి కెక్కడుండేవాడివి? పదిరూపాయిలు అడిగానని గొంప తెంపుతున్నా నన్నేశావ్? ప్రాణం కాపాడినసంగతి మరిచి పోయావ్?

శంకర—ప్రాణం కాపాడావ్? అందుకే యిట్లా నెత్తురోడ్చి, చంపుతున్నావ్.

వ్యక్తి—చంపేదేమిటయ్యా! నీ ఇబ్బందిలో నే నడ్డం పడ్డందుకు-నా ఇబ్బందిలో నీచేత సాయం చేయమంటున్నాను.

శంకర—కాని నా శ్రమసంగతి - ఆలోచించటం లేదు.

వ్యక్తి—ఏముంది శ్రమకి? ఒంటరిగాడివి; ఎట్లాలేదన్నా నెలకి ఏభై రూపాయిలు సంపాదిస్తావ్. కష్టమేముంది!

శంకర—ఒంటరివాణ్ణి. సంపాదిస్తున్నాను; సంపాదించి, నీకిస్తున్నాను. ఎందుకూ? చావలేక? కాని ప్రతినిమిషం భయంతో, ఈ మారువేషంలో బ్రతికుండకపోతే ఏం చెన్నయ్యా? బ్రతికి నేనేం బావుకుంటున్నాను?

వ్యక్తి—అంత కష్టంగావుంటే ప్రాణాలొదులుకో. నేకాదన్నానా;

శంక—అయితే - నన్ను పోలీసులికి పట్టిస్తావ్ - గాని పట్టుకు వదలవన్న మాట?

వ్యక్తి—బ్రతకటం - నీకిష్టం లేకపోతే, నేపట్టుకుంటే ఆగుతావా?

శంక—బ్రతుకుమీద ఆశతోనే - ఇన్నాళ్ళూ నువ్వెంతడిగినా ఇచ్చాను. నా ఆస్తంతా ధారపోశాను. నా బ్రతుకే నీకు బానిసత్వం చేసుకున్నాను. ఇంతకూ అసలు-నాదోషమేమిటో, నాకే తెలియదు.

వ్యక్తి—దోషం నీది కాకపోతే - నీచెల్లెలిది.

శంక—దాని దోషం మాత్రం ఏమిటి? పాపం? జీవితంమీద అభిమానమేగా? . . .

వ్యక్తి—ఏదో ఒకటి. పరాయివాడి ప్రాణం తీసినతర్వాత ఎందుకనే ప్రశ్న రాదు.

శంక—ప్రశ్న రాదు; శిక్ష తప్పదు; పోయిన అభిమానం తిరిగి పుట్టదు. అందుకనే నా చెల్లెలు ప్రాణాలొదిలింది. కాని నేనేం పాపం చేశాను?

వ్యక్తి—పాపం చేశావో - లేదో పోలీసుల్తో చెప్పు. డబ్బిస్తావా; ఇంటికి వెళతా; డబ్బులేకపోతే స్టేషన్‌కెళ్తా - ఏదో ఒకటి - త్వరగా తేల్చు.

శంక—ఏదో నువ్వే తేల్చు; నన్నొదిలి ఇంటికి వెళ్ళినాసరే - నన్నా స్టేషన్‌కు తీసుకెళ్ళినాసరే.

వ్యక్తి—అయితే ప్రాణాలకే తెగించావన్నమాట!

శంక—ఆ! (కత్తి బయటకు తీస్తాడు)

వ్యక్తి—ఆ!

శంక—నీసంగతే, నాసంగతీ ఇవ్వాళ తేల్చుకోవాలి; ప్రాణాల మీదాశపెట్టుకున్నాన్నాళ్ళూ, భయపడిదాక్కున్నాను. ఇవ్వాళ ప్రాణాల ఆశవదులుకుని బయటపడ్డాను. ఇన్నాళ్ళూ సాహసించలేకపోయాను. ఇప్పుడు సాహసిస్తున్నాను. ఈజగతిలో భగవంతుడు తప్ప వేరెవరూ లేరు. మన యిద్దరి నేరాన్నీ భగవంతుడే పరీక్ష చేస్తాడు. నేనిక దేనికైనా సిద్ధమే.

వ్యక్తి—ఆగు...

శంక—బ్రతుకుకోసం భయపడను. ఇన్నాళ్ళూ ఆగాను; ఇక ఆగను.

వ్యక్తి—అయితే ఏం చేస్తావ్! (వెనక్కు తగ్గుతాడు)

శంక—అరవను; అటువంటి బాధ లేదు; అరవాల్సిన అవసరం కొంచెం అట్టే లేదు;

వ్యక్తి—అయితే నన్ను ఖూనీ చేస్తావా!

శంక—అది ఏమంత కష్టం కాదు. నా ప్రాణాలొదలదల్చుకున్నాక నాకా భయంపోయింది; కాని మనిద్దరం చస్తే భూభారం కూడా తగ్గదు. నాకు కావాల్సింది - నా భారం తగ్గటం.

నిన్ను చంపితే నాభారం తగ్గదు. భారం తగ్గటానికి నేను చావాలి; కనక నిన్ను చంపను - చెన్నయ్యా! చంపితే కక్ష తీరదు. బ్రతికితేనే బ్రతుక్కి శిక్ష. నా సంసారం ఈ విధంగా చితికిపోవటానికీ, నా చెల్లెలు చావుకీ, నా చావుకీ, బ్రతికున్నవాళ్ళల్లో బాధ్యతనీది; నువ్వు బ్రతికే వుండి భగవంతుడికి జవాబు చెప్పుకో, నీ బాధపడలేక, నే చావుకు సిద్ధపడ్డాను. బ్రతికించి-నన్ను వేధించి చంపే, బదులు, నువ్వే నన్ను చంపి సుఖపెట్టు. ఈ కత్తి నీ పాదాల దగ్గర పెడుతున్నాను - నా ప్రాణాలతో సహా. ఇదిగో - నీ వడిగిన వంపసురాపాయిలూ, ఇదిగో కత్తి (కళ్ళు మూసుకుని, మోకరిల్లి, డబ్బు - కత్తి వ్యక్తి పాదాల దగ్గర వుంచుతాడు. వ్యక్తి తొందరగా కత్తిని లాక్కుంటాడు)

శంకర — కత్తి తీసుకో - గుండెల్లో నెత్తురు తాగెయ్యి. త్వరగా చెన్నయ్యా. ప్రాణాలు ఈ 'బొందె బందిఖానా' లోంచి రివ్వున ఎగిరిపోయి, స్వేచ్ఛగా సంచరిస్తాయి. తొందరగా - ఆలస్య మెందుకు? ఆలస్యం ఎంత బాధ. నాకత్తితో ఆత్మను స్వర్గానికంపెయ్యి - చెన్నయ్యా! నీ పాదాల దగ్గర పడివున్న కుక్కను కత్తిరించి, వూపిరి నాపివెయ్యి.

వ్యక్తి — లే శంకరం!

శంకర — (కళ్ళు తెరవకుండానే) లేస్తాను, చేతికందేట్టు తెచ్చి, నువ్వు పొడుస్తావా? నుంచుంటాను.

వ్యక్తి—పద.

శంకర—ఏమన్నంటావా! పోలీసు స్టేషనకా! పద; నీకంత ధైర్యం లేకపోతే, పోలీసులు ఉరిత్రాటితో మెత్తగా ప్రాణం తీస్తారు - పద -

వ్యక్తి—రాను.

శంకర—ఏమంటావ్?

వ్యక్తి—రావద్దు; నీ దగ్గరికి నేనూ ఇక రాను. బ్రతుకు మీద తీపి నాకూ తెలుసు. ఇక నీ బ్రతుకు నువ్వు బ్రతుకు. ఈ వంద రూపాయలు నువ్వే తీసుకో. కత్తి నేను తీసుకు పోతాను. బ్రతికే వుంటే, నీకు సాయపడతాగాని - బ్రతికి ని న్నిక బాధ పెట్టను. వస్తాను -

శంకర—ఓ; ఎంత నిరాశ -

చెన్న—నిరాశగానే ఉంటుంది - నీ పరిస్థితుల్లో, ఆశ చిగుర్చుతుంది - వచ్చి నీ ఆస్థంతా తీసుకో. నీజోలికి నే నిక రాను.

శంకర—చెన్నయ్యా! వద్దు; బ్రతికితే ఆశ దానంతట అదే పుట్టుకొస్తోంది. ఆస్థి నువ్వే తీసుకో; జరిగినదంతా మర్చిపోయి ఈమారు వేషంలో - మారు జీవితం గడుపుతాను. వెళ్ళు చెన్నయ్యా - నన్ను కాసేపు ఆనందించనియ్యి.

చెన్న—వెళ్ళొస్తా.

శంకర—ఆ - వెళ్ళిరా.

[వ్యక్తి వెళ్ళిపోతాడు. శంకరం అలాగే కాసేపు నుంచుంటాడు బయటనించి రాజాగారు, రఘుగారు వస్తారు]

రాజా—వెధవ సినిమా! వెధవ సినిమా అని! ఇట్లాంటివి తియ్యకపోతేనేం?

శంక—సినిమాకి వెళ్ళారాండీ? బాగా లేదా?

రఘు—Dull గా వుంది. Dull గా...... ఈ హోటల్ లాగ, ఈ గదిలో నీ మొహంలాగ...

శంక—కాస్త కాఫీ తీసుకువస్తాను; తాగండి - బాగా ఉంటుంది. (గబగబా వెళతాడు)

రఘు—అదేమిటి! అక్కర్లే! అక్కర్లేదంటే!! అరే...

రాజా—ఏడి కాస్త చురుకు పుట్టినట్టుందే - ఈ గదిలో - ఈ హోటల్లో...

రఘు—ఆ ఆ! ఏదో జరిగింది.

[శంకరయ్య రెండు కాఫీలు పట్టుకొస్తాడు]

రఘు—అడగందే - పెట్టందే, కాఫీ ఎందుకు తెచ్చావ్ - డబ్బు దండగ.

శంక—ఈ డబ్బు నేనిస్తా తాగండి. (గబగబా వెళ్ళిపోతాడు)

రఘు—(కోపంగా) ఆ!

రాజా—ఏదో హుషార్‌లో అన్నాడ్లే - తాగు.

రఘు—(నవ్వేసి) ఊ... (కాఫీ త్రాగి చూసి)

రాజా—కాఫీ బాగానే వుంది.

రఘు—బాగానే వుంటుంది - తాగిన కాసేపు - తర్వాత?

రాజా—Dull గా వుంటుంది.

—: తెర :—

———

# కొత్తఉత్తరం

# పాత్రలు

రామం<br>రంగనాథం } — సహవిద్యార్థులు

కుర్రవాడు — రంగనాథందగ్గర పనిచేసే కుర్రవాడు.

వెంకట్రామయ్య — సరళ తండ్రి.

కొత్తాయన — రమ తండ్రి.

పోలీసు - కొత్తాయన బావమరిది.

కరుణాకరం — రంగనాథం స్నేహితుడు.

సరళ — రంగనాథం ప్రియురాలు.

రమ — కొత్తాయన కూతురు.

# కొత్త ఉత్తరం

[రంగనాథం గది. రంగానికి రెండువైపులా రెండు దర్వాజాలు, వెనక గోడలో ఒక దర్వాజా వున్నాయి. కుడి వైపు దర్వాజా బయటకు; ఎడమ మధ్య దర్వాజాలు లోపల గదులకు దారియిస్తాయి. గదిలో ఎడమవైపు చిన్న టేబులు, కుర్చీలు. కుడివైపు ఒక సోఫా వున్నాయి.

తెర ఎత్తేసరికి రంగనాథం టేబుల్ దగ్గరకూర్చుని వ్రాసుకుంటున్నాడు. రామం పచార్లు చేస్తున్నాడు. రంగనాథం వ్రాత ముగించి—కాగితం రామం దగ్గరకు తీసుకొస్తూ]

రంగ—ఇదిగోరా విను (తను రాశిన కాగితం చదువుతూ)

ప్రియమయిన సరళకు,

నువ్వు నన్ను ప్రేమించినట్లు నాకు తెల్సు. నేను నిన్ను ప్రేమించినట్లు నీకూ తెల్సు. మనిద్దరం ఒకరి నొకరు ఎంతగా ప్రేమించుకున్నామో – అది – మనిద్దరికీ, విడివిడిగా – ఉమ్మడిగా కూడా బాగా తెల్సు. పెళ్ళి చేసుకుందామని మన మిద్దరం అనేకసార్లు ప్రమాణాలు కూడా చేసుకున్నాం – ఎవ్వరికీ తెలీకుండా. ఇకపోతే మన 'ప్రేమకలాపం' తెలియనిదల్లా ఒక్క మీనాన్న గారికి. మీ నాన్నగారు ఉత్త నిర్లక్ష్యపు తిండిపోతన్న సంగతి నీకూ లోకానికీ తెల్సు. "ప్రేమ, అనురాగం"

అంటే తెలియని 'పరమ బైరాగి' అన్న సంగతి నాకు బాగా తెల్సు. ఇప్పటికి అనవసరంగా చాలా ఆలస్య మైంది. కనక ఇకనన్నా మన విషయాన్ని ఆయనకి తెలియ బరచి, వివాహానికి ఏర్పాట్లు చేయమని-ఆయన్ని కోరమనీ - నేను నిన్ను కోరుతున్నాను. ఇది చాలా జరూరు.

ఇట్లు,
నీ రంగనాథం

రామం—అయిపోయిందా?

రంగ—ఆ. ఇది చాలంటావా? ఇంకా యేమన్నా మార్చాలా?

రామం—అక్కర్లే! సంతకం మాత్రం కొట్టు. కవర్లో పెట్టు. అంటించెయ్. పంపించెయ్ -

రంగ—ఎట్లా (అని ఉత్తరం కవరులో పెట్టి అంటిస్తుంటాడు)

రామం—ఎట్లా ఏముంది? మన కుర్రవాడున్నాడుగా! వాడి కిచ్చి పంపిద్దాం. అరే కుర్రాడా!

[అని పిలుస్తాడు కుర్రవాడొస్తాడు]

రంగ—ఇది తీసుకెళ్ళి యిచ్చిరారా.

కుర్ర—ఎవరికండీ?

రంగ—రోజూ మన రోడ్డువెంట వెళ్తూ వుంటుందే - ఆ అమ్మాయికి...

కుర్ర—రోడ్డువెంట ఇటు - రోజూ - చాలా మందమ్మా యిలు వెళ్తూ వుంటారండీ!

రంగ—అదేరా! ఎర్రగా వుంటుందే - ఆ అమ్మాయి.

రామం—అదేలే - ఒక మాదిరి ఎరుపు-

రంగ—ఛ! బాగా ఎరుపే!

రామం—అదేరా! లావుగా ఉండదూ - ఆ అమ్మాయి.

రంగ—ఏమంత లావులే - సన్నమే - (కుర్రవాడితో) నే మాట్లాడుతుండగా చూడ లేదట్రా - ఎప్పుడూ ?

కుర్ర—ఆ అమ్మాయా అండీ! మీరూ, రామంగారూ మాట్లాడే అమ్మాయా ?

రంగ—ఛ! రామం ఎప్పుడు మాట్లాడాడు ? మాట్లాడ లేదే.

రామం—మాట్లాడేరా - ఒకసారి -

రంగ—ఎప్పుడూ ?

రామం—చాలా రోజుల కిందటలే -

కుర్ర—మాట్లాడారండీ. అప్పుడు సన్న చూపి దాక్కున్నారుకూడా.

రామం—నే దాక్కున్నానా ?...ఏడిశావ్ !

కుర్ర—అదేలెండి! ముఖం తిప్పేసి, పుస్తకం అడ్డుపెట్టుకున్నారు.

రామం—ఏడిశావ్ లే - ఆ అమ్మాయి వేరు.

కుర్ర—ఓహో! అయితే తెలిసిందండి! సన్నగా ఎర్రగా వుండే అమ్మాయి కాదండి...లోలాకులు పెట్టుకుని...

రంగ—ఆ. ఆ ఆ అమ్మాయే. కాసేపు ఈ సందు చివర నుంచో, కాలేజికి ఆ అమ్మాయి యిటే వస్తుంది.

కుర్ర—అవును. సాయంత్రం ఇటే వస్తుంది.

రంగ—రాగానే... ఈ ఉత్తరం ఇచ్చెయ్యి... పో... జాగ్రత్త.
(కుర్రవాడు వెళతాడు)

రామం—ఫరవాలేదులే! వాడు యిట్లాంటి వాటిల్లో సమర్థుడే -

రంగ—ఈ ఉత్తరం అందుతుంది. తాడో పేడో - తేలిపోతుంది. వెంటనే పెళ్ళిచేసుకోవటం - కాపురం పెట్టెయ్యటం అంతే... ఈ లోపున మంచి ఇల్లు కూడా చూడాలి... కాపరానికి

రామం—చూద్దాంగాని - ఆ అమ్మాయి తండ్రి తేలికగా ఒప్పుకుంటాడా? అని.

రంగ—అరే! మర్చిపోయాం రా!

రామం—ఏమిటి?

రంగ—తండ్రితో గట్టిగా చెప్పమని గట్టిగా వ్రాయాల్సింది.

రామం—అహా! పోన్లే! ఈ తడవ మరీ గట్టిగా రాద్దాం! మనం చెప్పకపోయినా ఆ అమ్మాయి గట్టిగా చెప్పదంటావా?

రంగ—చెప్తే గట్టిగానే చెప్తుంది; బలే పట్టుదలగల మనిషి; ఒక పట్టాన వప్పుకుందా...నాతో మాట్లాట్టానికి

రామం—(ఏదో విన్నట్లు బయటవైపుకు తిరిగి చూస్తూ) ఎవరో వస్తున్నట్లున్నారే?

రంగ—(చూసి) ఆ అమ్మాయేరా! (ఖంగారుపడి ఎదురు వెళ్తూ) రా...రా.

(సరళ లోపలికి వస్తుంది)

రంగ—కూర్చో, కూర్చో సరళా! - సీ సంగతే ఆలోచిస్తున్నాం.

సరళ—ఏమాలోచన? నాకేం పాలుపోకుండా వుంది రంగనాథం! (కూర్చుంటుంది)

రంగ—పాలుపోవటానికేముంది? పెళ్ళిచేసుకోటానికి పాలుపోనటమెందుకూ?

సరళ—(రామాన్ని చూపిస్తూ) వీడెవరూ?

రంగ—మనవాడేలే. మన సంగతులన్నీ తెల్సు! నా ఉత్తరం చూచుకున్నావా?

సరళ—ఎన్ని ఉత్తరాలు రాసి ఏం లాభం? మా నాన్న చస్తే ఒప్పుకోనంటున్నాడు.

రంగ—మరి నువ్వు గట్టిగా చెప్పలే?

సరళ—గట్టిగా! గట్టిగా చెప్పటమే? గట్టిగా చెపితే గొంతు పిసికేస్తాడు.

రంగ—ఆ...

సరళ—తన గొంతులోగానీ, నా గొంతులోగానీ - ప్రాణం వుండగా ఒప్పుకోట్ట.

రామం—ఇల్లాకాదురా! ఇది మీ ఇద్దరివల్లా కాదు. ఇక నేను పూనుకుంటా; చూడు.

సరళ—ఏం చేస్తారేం?

రామం—సరాసరి వెళ్ళి కుండ బద్దలుకొట్టేస్తాను.

సరళ—అంటే ?

రామ—అంటే ఏముంది? వెళ్ళేదీ - ''ఏమండీ. మా రంగనాథం మీఅమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని చాలా ఇదైపోతున్నాడు. పాపం-వెంటనే పెళ్ళిచేసేస్తే సరిపోతుంది'' అంటా.

సరళ—అంటే?

రామం—అంటే...? ... ఇంకేముందీ - అంటానికి? ''మా అమ్మాయి ఒప్పుకుంటే అల్లాగే'' అంటాడు - అంతగా అంటే.

సరళ—కాదు. ''మా అమ్మాయికి వేరే సంబంధం చేసుకుంటున్నాం'' అంటాడు.

రామం—''మీ అమ్మాయి ఒప్పుకుందా'' అంటా.

సరళ—ఒప్పుకుందీ - అంటాడు.

రంగ—ఎవరూ - ఒప్పుకుంది?

సరళ—నే నేలే!

రంగ—నువ్వు ఒప్పుకున్నావా?

సరళ—ఏంచేయను రంగనాథం! నిన్నే పెళ్ళ చేసుకుందామనుకున్నా - కాని ఆయన అంత పట్టుపడుతుంటే - నేను...

రామం—పట్టుబడితేమాత్రం! నచ్చిని పెళ్ళి చేసుకుంటావా?

సరళ—నచ్చినా పెళ్ళిచెయ్యకపోతే - ఏం చెయ్యను?

రామం—''ఛీ! నాకీపెళ్ళి వద్దు నాకు రంగనాథం చాలా నచ్చాడు'' - అనాలి.

సరళ—అంటే- ఎందువల్లా అని కారణాలు అడుగుతాడు.

రామం—మా రంగనాథం B A. చదువుతున్నాడు.

సరళ—అతను B. A. Pass అయ్యాడు.

రామం—మా రంగనాథం దిలీప్‌కుమార్ లాగుంటాడు.

సరళ—అతను అశోకకుమార్ లాగుంటాడు.

రామం—మా రంగనాథంకి గోలెడంత ఆస్తివుంది.

సరళ—అతనికి పెద్దజమీందారీ పినతండ్రి చచ్చిపోతే వస్తుంది.

రామం—మా రంగనాథం సిన్మాలో ప్రేమించి 'ప్రేమ లేఖలు' వ్రాశాడు

సరళ—అతను 'విరహగీతాలు' వ్రాస్తున్నాడు.

రంగ—ఇంతకూ నీకు అతనే నచ్చాడా ఏం?

సరళ—నిజం చెప్పనా రంగనాథం! నువ్వు నాకు నచ్చినమాట నిజమే. కాని నీకంటె బాగా అతను నచ్చాడు. ఏం చెయ్యను? నీకంటె అన్నివిధాలా అతను నచ్చటానికి ఆస్కారం వుందావె. నేనన్నీ ఆలోచించే అతను నచ్చాడని చెప్పుకున్నాను. ఈవిషయాలు చెప్పటానికి ఎంత బాధ పడ్తున్నానో భగవంతుడికెరుక!

రంగ—బాధపడినా - చెప్పుతున్నావు నిన్నమాట!

సరళ—ఏం చెయ్యను? ఎల్లా కాదందామనుకున్నా వీల్లేకపోయింది. అందుకని - చెప్పుతున్నాను. మొన్నరాత్రి...

రంగ—మొన్నరాత్రి!

సరళ—ఆ - మొన్నరాత్రి - అంతా స్థిరమైపోయింది. నిన్న తెల్లారు లేవంగానే, నీ వుత్తరం వచ్చింది.

రంగ—నా ఉత్తరమా!

సరళ—ఆ. !

రామం—అదే - నే రాశిన ఉత్తరం కాబోలు!

రంగ—నువ్వురాశిన ఉత్తరం?

రామం—అదే ... సీతరఘున నేరాశింది. నిన్నప్రొద్దున వ్రాశాంగా.

రంగ—అది ఏం లేదుగా.

రామం—లేదు. నీకు చెప్పలే. ప్రొద్దున్నే కాఫీకి అటుపోతూ-కిటికీలోంచి పడేశా.

సరళ—ఆ; కిటికీలోంచి పడింది. గదిలో అప్పుడక్కడ మా నాన్న వుండి - చింపి చూశాట్ట.

రామం—మీనాన్న!

రంగ—అరే!

సరళ—నన్ను నానా చీవాట్లు పెట్టాడు - ఎవ్వరికీ వినిపించ కుండా అయిదారు రోజుల్లోనే పెళ్ళి చేసేస్తానని ప్రతిజ్ఞ చేసేశాడు.

రంగ—ఛ. ఛ. రామం; ఎందుకురా ఇట్లా ఆ వుత్తరం నువ్వ్రా...

రామం—నువ్వే రాయమన్నావ్ గాదురా నన్ను. నీ చెయ్యి అచ్చిరావటం లేదని,...

సరళ—మీ చెయ్యి ఎల్లాగో, అచ్చివచ్చిందిలెండి. నిజం గానే రంగనాథం చేతిమీదగా ఆ వుత్తరం వస్తే ఆ చెయ్యి అదృష్టాన - నాకు బడితపూజ అయేది. అదే-

చెప్దామని వచ్చా రంగనాథం. ఇక వుత్తరాలు వద్దు. స్నేహం వద్దు. నువ్వు మాత్రం ఏం అనుకోక! ఇంకేవ ర్నన్నా ప్రేమిస్తే ప్రేమించుగాని– ప్రేమ లేఖలు రాయకు. ప్రమాదం. ఇహ నే వస్తా. వస్తానండీ (వెళుతుంది)

రంగ—ఛ! ఛ! కథ అడ్డం తిరిగింగి.

రామం—ఇక వకటే గత్యంతరం.

రంగ—ఏమిటీ?

రామం—వేరే మరో పిల్లని– మరో వీధిలో చూచి, ప్రేమించినా ప్రేమించకపోయినా, పెళ్ళిచేసుకోటం.

రంగ—ఆగరా.

రామం—ఆగి ఏం లాభం? గతం మర్చిపో – రంగనాథం! ఏడ్చి ఏం లాభం లేదు.

రంగ—ఏడుపూ లేదు, గీడుపూ లేదు. ఆగు. ఇప్పుడు పంపిన యీ వుత్తరం ఏమవుతుందో.

[గబగబ కుర్రవాడు వస్తాడు]

కుర్ర—బాబుగారూ—బాబుగారూ!

రంగ—ఏంరా!

రామం—ఏమయిందరా?

కుర్రా—ఏమైందేమిటండీపంపక పంపక వెధవఉత్తరంపంపారు.

రంగ—ఏమైందీ?

**కుర్రా—ఇటువంటి ఉత్తరం అంటే నే నసలు తీసికెళ్ళేవాడిని గాదండి.**

రంగ—ఆ ఉత్తరం యిచ్చావా?

రామం—ఆ అమ్మాయికా? ఇంకా ఎవరికన్నా ఇచ్చావా?

కుర్ర—ఇచ్చా! ఆ అమ్మాయికే. తీసుకుంది. మొదటచూసి తర్వాత నలిపేసి నేలను కొట్టింది.

రంగ—ఆ వుత్తరం ఏదీ?

కుర్ర—వెధవ ఉత్తరం! ఇటువంటి వుత్తరం నా చేత పంపిస్తారూ?

రంగ—ఇహ పంపన్లే. గోల చెయ్యకు...

కుర్ర—ఇంతిపంకూ నే ఉత్తరాలు ఎందరికి తీసికెళ్ళి యివ్వలేదు. ఇల్లా ఎప్పుడైనా జరిగిందా – ఛ. ఛ. – రోడ్డుమీద నా తల కొట్టేసినట్లయితే!

రామం—ఏమన్నా గోల జరిగిందా యేం రోడ్డుమీద...!

కుర్ర—నేను గోల జరగనిస్తానూం – ఎప్పుడన్నా? ఎన్ని ఉత్తరాలిచ్చాను. యీ చేతుల్లోంచి. ఆడవాళ్ళ వుత్తరాలు మగవాళ్ళకి, మగవాళ్ళ ఉత్తరాలు ఆడవాళ్ళకి. ఆడవాళ్ళవి ఆడవాళ్ళకి మగవాళ్ళవి మగవాళ్ళకి...ఆడవాళ్ళ మగవాళ్ళవి మగవాళ్ళ ఆడవాళ్ళకి...

రంగ—అవ్వన్నీ ఎవరి కెవరి కిచ్చినా, నా వుత్తరం నాకే యివ్వరా బాబూ...

కుర్ర—తెచ్చాలెండి. రోడ్డుమీద కాచుకూర్చుని, ఆమె అటురాంగానే చేతికిచ్చా; విప్పిచూచి తిప్పి నేలను కొట్టింది. అది తీసుకుని నేను తిరిగివచ్చా.

రామం—బ్రతికాం. ఇక నువ్వు పో.

కుర్ర—ఈ తిప్పికొట్టే ఉత్తరాలు - యిహ నా కివ్వకండి.
(అంటూ వెళ్తాడు)

రంగ—నయమే.

రామం—ఇక నువ్వొట్టే మదనపడక; ఏదో నాల్గురోజులు రెస్టు తీసుకుని తర్వాత ఏవర్నన్నా ప్రేమిద్దువుగాని.
(రంగనాథం బల్లకు ఆనుకుని దిగులుగా కూర్చుంటాడు)

రామం—ఇంతమాత్రానికే అంత దిగులు పడతావేంరా?

రంగ—దిగులు గాక ఏముందిరా - యీ ప్రపంచంలో! ఇక ఈ భోగం చూసుకుంటూ, కన్నీళ్ళు కారుస్తూ, కాలం గడపాల్సిందే.

[కుర్రాడు, మరొక పెద్దమనిషి వస్తారు]

వచ్చినాయన—వీరేనా! (అని రామాన్ని చూపిస్తాడు)

కుర్ర—కాదండి! వారు (అని రంగనాథాన్ని చూపిస్తాడు)

వచ్చిన పెద్ద—ఈయనేనా! ఆ, నేను రిటైర్డు తాలూకా ఆఫీసు హెడ్ క్లర్కును లెండి. నా పేరు వెంకట్రామయ్య. వారెవరు? (రామాన్ని చూపిస్తాడు)

రంగ—నా స్నేహితుడే లెండి.

వెంక—ఏం చేస్తున్నారిక్కడ?

కుర్ర—చదువుకుంటున్నారండి - ఈగది అద్దెకు తీసుకుని చదువుకుంటున్నారు.

వెంక—చదువు కుంటున్నారే.

రంగ—మరేనండి! వాడు B. A. ఫైనల్ ఇయర్; నేను B. A. సెకండ్ యియర్.

వెంక—వెధవ వేషాలు వెయ్యకండి నాదగ్గర!

రంగ—ఏ వేషాలూ?

వెంక—ఏం వేషాలేమిటి! గది అద్దెకు తీసుకుని చదువు కుంటున్నామంటూ — ఈవేషాలు నా దగ్గర పనికిరావు.

రామం—మనం చదువుకోక ఏం చేస్తున్నాంరా – రంగనాథం?

వెంక—ఏం చేస్తున్నారా? ఒళ్ళు పొగరెక్కి – ఆడపిల్లలకి ఉత్తరాలు రాస్తున్నారు.

రంగ—ఏ ఉత్తరాలూ?

వెంక—ఏం ఉత్తరాలా! ఏమీ ఎరగనట్టక్కడికి – మేము ఆడపిల్లల్ని పెళ్ళిళ్ళు కాక నానా తంటాలు పడ్తూంటే...

రామం—ఇదేమిటి! మీరు పొరపాటు బడుతున్నారు. ఎవరు వ్రాశారో – ఏమో! సరిగ్గా కనుక్కోండి.

వెంక—మీరు కాక ఇంకెవరున్నారు? యీ వీధిలో – మీరే – మా అమ్మాయి గుర్తుకూడా చెప్పింది)

[బయట కేకలు వినిపిస్తాయి "ఎవరవుతే నాకేం? ఎక్కడున్నారు" కుర్రవాడి కంఠస్వరం:— "లోపలున్నారు పదండి" మరొక కొత్తాయన, కుర్రవాడూ వస్తారు]

కుర్ర—వీరేనండీ!

కొత్త—వీళ్ళేనా పంపింది?

కుర్ర—వీరే-

కొత్త—ఏమండీ - మీ కేమన్నా బుద్ధీ, జ్ఞానంవుందీ ?

రామం—ఈయ నెవర్రా ?

కుర్ర—ఎవరో దారేపోయే ఆయనండీ.

రంగ—అయితే లోపల కెందుకు తెచ్చావురా ?

కొత్త—కాస్త 'తడాఖా' చూపిద్దామని వచ్చానండి.

రంగ—తడాఖా ?

కొత్త—ఆ 'తడాఖా' రుచి చూపిస్తే, యిహ బుద్ధి కలిగి వుంటారనీ...

రామం—మీరనేది మా కేమీ అర్థమవటం లేదు.

కొత్త—అర్థం ఎందుకవుతుందీ ? ఒకసారి 'మజా ఖా' చూపెడ్తే అర్థమవుతుంది -

రామం—'తడాఖా' - 'మజాఖా' - ఏమిట్రాయిదీ ?

కొత్త—ఏమిటా! చూపిస్తే తెలుస్తుందిలే. ఆడ పిల్లలకి వుత్తరాలు రాస్తుంటే నేను చూస్తూ వూరుకుంటాననుకున్నావేం ?

వెంక—ఉత్తరం రాశారా! ఎవరికి ?

కొత్త—ఎవరికంటావేమిటయ్యా - సిగ్గులేక ! మా అమ్మాయికి - నా కూతురికి-

వెంక—మీ కూతురికి వీళ్ళు వుత్తరం వ్రాశారా ?

కొత్త—రాశారు. రాసి నా ఎదటనే చేతి కిచ్చారు. మా అమ్మాయికి.

రామం — ఎవరూ?

కొత్త — ఇదుగో - ఆ వెధవ కుర్రాడు ఇచ్చాడు.

రామం — మీ అమ్మాయికి యిచ్చాడూ?

కొత్త — ఆ! మా అమ్మాయికి నా కళ్ళ ఎదట - నా కళ్ళ ఎదట యిచ్చాడు. నలిపేసి, నేలకేసి కొట్టింది.

వెంక — మీ అమ్మాయికి ఉత్తరం రాశాడూ - వీళ్ళు!

(రంగనాథం ఉత్తరం కిటికీలోంచి పారేస్తాడు)

కొత్త — రామయ్యా! పిల్లోళ్ళకి అసమర్థులు పిల్లల్ని కనసి, పూరి బూరాప పనిలేతే!

వెంక — ఆ ఉత్తరం రాశింది పిల్లదన్నలో - ఎవరసి!

కొత్త — ఆపవయ్యా - వేశాలు - బుద్ధుసవాళ్లు. పెంచటం చేతకాకపోతే పిల్లల్ని కనటం పొయ్యిలో పెట్టు. అంతే గాని పూరివాళ్ళ ఆడపిల్లలకు ఉత్తరాలు రాయిస్తావా?

వెంక — అయ్యా! మీ అమ్మాయని నాకు తెలియదు?

కొత్త — తెలియకుండానే రాశారా - ప్రేమలేఖ ఉత్తరాలు! ఏమయ్యా - ఆ ఉత్తరం ఏదీ?

రామం — ఏ ఉత్తరం?

కొత్త — ఏ ఉత్తరం! వాడు మా అమ్మాయికి పంపిన ఉత్తరం...

రంగ — ఏదీ! కావాలంటు నతో ఇవ్వండి?

వెంక — శ్రీకృష్ణా! పిల్ల ఉత్తరం రాశారన్న సంగతి నేను ఇప్పుడే వింటున్నాను.

కొత్త—ఒప్పుకుని ఊరుకోవటంకాదు. మీరు కలుగజేసుకుంటే సరే. లేదా! నాతో చెప్పండి! నేచూస్తా వీళ్ళ సంగతి!

వెంక—వీళ్ళసంగతి మీరే చూస్తే - నాచేత్తో నేనూ మీకు సహాయం చేస్తాను.

కొత్త—మరి ఆమాత్రం చేతకానివాడివి ఎలా కన్నావయ్యా పిల్లల్ని.

వెంక—ఆగండాగండి; నేను వీళ్ళని కనలేదు; వీళ్ళకి నాకూ ఏ సంబంధం లేదు.

[ఇదంతా విని - రంగనాథం గాభరాపడి - కిటికీదాకా వెళ్ళి ఎవ్వరూ చూడకుండా ఉత్తరం బయట పారేస్తాడు.]

కొత్త—మీపిల్లలు కాదూ వీళ్ళు?

వెంక—కాదు. మాపిల్లకి పెళ్ళి ఉత్తరం రాశారు.

కొత్త—మీపిల్లకి! ఆడపిల్లకి?

వెంక—ఆ, నిన్న ప్రొద్దున; అది నాకింటు పడింది; దానిసంగతి కనుక్కుందామని వచ్చాను.

కొత్త—అయితే మీ అమ్మాయికి నిన్న, మా అమ్మాయికివ్వాళా ఉత్తరాలు రాశారన్నమాట.

వెంక—ఆ.

కొత్త—మీ అమ్మాయికి ఉత్తరం రాశిందెవరూ - యీ ఊర్లో?

వెంక—ఏమో!

కొత్త—ఏమయ్యా?

రంగ— రాశింది - నేను.

వెంక—మా అమ్మాయిని.

రామం—అది రాసింది నేనూ—వాడి తరఫున; కాని అయ్యా! మీరు మమ్మల్ని కొట్టదల్చుకుంటే చెప్పండి! మేమూ తయారవుతాం. జమీందారులు రైవాధీనాలు. మీరు మొదలుకుండా చల్లగా మర్యాదగ వుంటాం అనుకోం.. లేకపోతే.....

కొత్త—ఏమవుతుందేం?

రామం—వినండి. మాదగ్గర కొన్ని వుత్తరాలున్నాయి-మీ అమ్మాయిగారు లోగడ వ్రాసినవి. వాటిని మేం Print చేయించి వ్రాళ్ళ......

కొత్త—పంచిపెడతావేం? చూస్తూ - ఏంచేస్తానో - సాయంత్రానికి Arrest చేయిస్తా ఆరునెలలు కఠినశిక్ష వేయిస్తా. మాబావమరిది, Head Constable -రండి మీగేసాక్ష్యం నాకు.

వెంక—ఎందుకండీ దెబ్బలాట్టం, ఏదో సరసంగా పోయ్యే దానికి...

కొత్త—ఇది బాగుందే - ఈ వుత్తరాల సరసం. ఆమాత్రం గుండెల్లేనివాడివి ఎందుకు కన్నావయ్యా - ఆడపిల్లల్ని.

వెంక—ఏదో కన్నందుకు బాధపడాలిగా;

కొత్త—నీకు చేతకాకపోతే, నన్నుచూసి నేర్చుకో, మా అమ్మాయి చూడు, ఉత్తరం చూడకుండానే నేలనేసి

కొట్టింది. అల్లావుండాలి పిల్లంటే. కాని నిరా అమ్మాయి లాగానా - రా; రా; పిళ్ళసంగతి నేచెప్తా. పోలీసుల్కి అప్పచెప్పకపోతే - అప్పుడను.

(లాక్కుపోతాడు)

రంగ—నిజంగా పోలీసుల్ని తెస్తాడా - ఏరా?

రామం—తేస్తే ఏం? వాళ్ళమ్మాయికి మనం ఉత్తరం రాయందే.

రంగ—ఇప్పుడు రాశిన ఉత్తరం వాళ్ళమ్మాయి కే-వెళ్ళిందిగా.

రామం—వెళితే యేంలే? తిరిగి వచ్చేసిందిగా. ఆ ఉత్తరం చింపెయ్యి. ఆ ఉత్తరం ఏదీ?

రంగ—లేదురా! అవతల పారేశా - కిటికీలోంచి.

రామం—సరే! భయంలేదు. ఉత్తరం మనదగ్గర లేదుగా?

రంగ—అది వాళ్ళకి దొరికితే - కొంపదీసి.

రామం—అది మనం రాయలేదందాం. సంతకం లేదుగా?

రంగ—అహా! సంతకం వుందిరా! కొట్టెయ్యలేదు.

రామం—కొట్టెయ్యలా! కొట్టెయ్యమంటేనే?

రంగ—ఇల్లా అవుతుందనుకున్నానూ? కొట్టెయ్యకుండానే యిచ్చాను.

రామం—సరేలే...దొరికేడిసిందట...ఆ, నీకు సరళ రాసిన ఉత్తరా లెక్కడున్నాయి.

రంగ—ఇదిగో File లో (File తీస్తాడు)

**రామం—అవన్నీ తీసి పరశురామ ప్రీత్యర్థం పొయ్యిలో పారై...**

రంగ—అంతే నంటావా?

రామం—ఇంకెందుకు అదీ! ఈ సరళ Photo కూడా పార
య్యొచ్చు

రంగ—ఆ Photo కూడానా!

రామం—Photo కూడా! అసలు అమ్మాయి కాదని
పోయిం తర్వాత Photo ఎందుకు, ఏడవను...

రంగ—నిజమే లే...

రామం—మరి, పద, ఇదిగో Photo! యిదిగో File పద.

రంగ—సరే...అన్నీ తగలెడతాగాని ఈ Photo వుంచు
దాంరా...

రామం—సరే వుంచు. (రంగనాథం Photo Drawer లో
వుంచి రాగా) ఛా. ఇక ఆ గదిలో కుంపటి వెలిగించి -
ఒక్కొక్క ఉత్తరమే తగలబెట్టు File తో కూడా

(రంగనాథం File తో సహా రెండవైపు వున్న గది
లోకి వెళ్ళాడు. లోపల కుర్రాడి మాటలు వినిపిస్తాయి).

రామం—(అటుచూసి) ఏమిట్రా - అదీ?

కుర్రా—(లోపల్నుంచి ఎవరో వచ్చారండి అంటాడు.)

రామం—రమ్మను.

[లోపలికి రమ వస్తుంది]

రమ—నమస్తే!

రామం—ఎవరూ!

రమ—నేనండి - రమని.

రామం—కూర్చోండి. మీరు College లో చదువుతున్నారు గదూ...

రమ—మరే. మీ ఉత్తరం అందింది.

రామం—ఉత్తరం? ఏ ఉత్తరం ?

రమ—అదే! మీరు రాసిపడేయ్యలా? - అది.

రామం—రాసి పడేశానూ!

రమ—అదే! మొదట ఆ కుర్రాడి కిచ్చి పంపారు.

రామం—ఏహో - అది......మీకూ......అందిందా!

రమ—ఆ! నేనూ మా నాన్నగారు వెళ్తుంటే మీ కుర్రాడు నాకిచ్చాడు! మా నాన్నగారుండగా అలాంటి వుత్తరం రాస్తే - ఏమనుకుంటారండీ - ఆయన ?

రామం—మీ నాన్నగారున్నారూ - మీతో.

రమ—ఆ! అందుకనే - నలిపేసి నేలకొట్టాను.

రామం—అహా!

రమ—ఉత్తరం చదవనుగూడా లేదు; తర్వాత - ఇప్పుడే చదివాను. మీ ఉత్తరం మీరు తీసుకోండి. నా జవాబు వుత్తరం దాంట్లోనే వుంది.

రామం—ఇది మళ్ళీ మీ దగ్గర కెట్లా వచ్చిందీ...

రమ—నేను తిరిగి యింటికి వెళ్తుంటే మీరే పడేశారుగా నా మీద.

రామం—నే పడేశానూ ?

రమ—ఆ! నేను తిరిగి యింటికి వస్తుంటే - కిటికీలోంచి పడేశారు.

రామం—...ఏమిటీ!

రమ—ఇహేంపరాత్రం ఎప్పుడూ అల్లా చేయకండి. కిటికీలోంచి అట్లా పడేస్తే నా మొహంమీద అందరూ నవ్వరూ! చూస్తే ఏమనుకుంటారు?

రామం—సరే.

రమ—.కావాలంటే — ఉత్తరాలిచ్చి, నే సాయంత్రం వెళ్తున్నప్పుడు చేతికివ్వమనండి.

రామం—ఇంతేనా......!

రమ—నేనూ మా దాసీదాని కిచ్చి పంపుతా — జవాబు.

రామం—అదంతా సరే — బాగానే వుంది. కాని అసలు విషయం విను. అది రాసింది నేను గాదు.

రమ—-మీరు కాదూ!

రామం—కాదు. మా స్నేహితుడు రంగనాథం, వాడూ మీకు రాయలా! పొరపాటున కుర్రాడు మీకిచ్చాడు.

రమ—ఇది నేనసలు ఒప్పుకోను. నన్ను చూసి — కిటికీలోంచి సరిగ్గా నా భుజాలమీద పడేట్లు వేశారు. మరి నాకుగాక ఎవరికి?

రామం—కారణాంతరాలవల్ల యిది కిటికీలోంచి పారెయ్యవల్సివచ్చింది. ఖర్మంచాలక నీమీద పడ్డట్టుంది. కావాలంటే — ఆ వుత్తరం రాసిన ప్రయోజకుడు — ఆగదిలో వున్నాడు. పోయి, కనుక్కో — పోతావా — పో — ఇటో — అటో — త్వరగా-పో-

రమ—పోయి కనుక్కుంటా (లోపలికి వెళ్తుంది.)

రామం—అరే సుబ్రాహ్! అరేయ్!

సుబ్ర—(వచ్చి) అయ్యా.

రామం—ఈ ఉత్తరం ఈ అమ్మాయికిచ్చావ్?

సుబ్ర—అవునండి! అప్పుడు వద్దని పారేసి - మళ్ళీ ఇప్పుడు గోష్టానికి వచ్చింది - పాపం!

రామం—ఈ అమ్మాయికా - ఏం యివ్వమంది?...

సుబ్ర—అయితే యీ అమ్మాయికి కాదండీ?

రామం—వచ్చినట్టుంది—

సుబ్ర—నాకేం తెల్సునండి! "రోజూ యిటుపోయ్యే అమ్మా" యన్నారు. ఈఅమ్మాయి రోజూ మన మేడవంకే చూస్తూ పోతుంది.

రామం—రోజూ యిటు చూస్తూ పోతూందేం...?

సుబ్ర—అవునండి! కనుక్కోండి - నామాట అబద్ధమైతే.

("రామం రామం" అని లోపల కేకలు)

రామం—ఎవరదీ? (కరుణాకరం అనే మరో యువకుడు వస్తాడు)

కరు—నేనురా!

రామం—ఎప్పుడు దిగావురోయ్.

కరు—నిన్న సాయంకాలం.

రామం—రా - కూర్చో; గుంటూరునించేనా రావడం?

కరు—అవును.

రామం—ఏం విశేషాలు. నాకు తెల్సినంతవరకూ యీవ్యా
రితో - నీకేం సంబంధం లేదే.

కరు—లేదురా; త్వరలోనే పెళ్ళి ఒకటి వస్తోంది.

రామం—దానికొచ్చావా! అట్లా చెప్పు. అహా! ఎవరిదీ
పెళ్ళి! బంధువుల్లోనా.

కరు—కాదురా; మనదే.

రామం—మనదేనా, అయితే ఇంకేం Party కొట్టామన్న
మాట.

కరు—పార్టీలకేంలే; "పెళ్ళి" పేచీలలో పడింది.

రామం—ఏం పేచీ!

కరు—ఏం లేదురా! నేను కొంచెం తొందరపడి పెళ్ళికి ఒప్పు
కున్నాను. కాని.

రామం—కాని.

కరు—కాని నామనసు మళ్ళీ మార్చుకోవల్సి వచ్చింది.

రామం—అహా.

కరు—ఇప్పుడెట్లాగైనా యీసంబంధం తప్పించుకోవాలి.

రామం—అదా సంగతి!

కరు—ఏ వుపాయమున్నా ఆలోచించాలిరా నువ్వు విష
యాల్లో అనుభవశాలివి. అందుకని నీదగ్గరకు...వచ్చాను.

రామం—వచ్చావు సరే, బాగానే వుంది...

కరు—వాళ్ళది ఈవూరే.

రామం—అయితే [illegible]

కరు—వాళ్ళ Addres అదీ యిస్తాను. వెళ్ళి ఎల్లాగన్నా పరిచయం చేసుకుని - నాకు పచ్చి అనో......

రామం—ఆ.

కరు—లేకపోతే ఏదో వక అవలక్షణం చెప్పి పెళ్ళి తప్పించాలి.

రామం - అదిగాదురా! అంత ఆలోచించకుండా పెళ్ళికి వప్పుకుని తప్పించటం నాకు వప్పజెపితే......

కరు—మళ్ళి వెనక్కి వెళ్ళకు, ఎందుకు ఒప్పుకున్నానా అని ఎన్నో రోజులు ఏడిచాను. ఎంత ఏడ్చినా తప్పలా. తప్పించటానికి నువ్వు తప్ప ఎవ్వరికీ చేతగాదు,

రామం—బాగా నేనుంది, మా రంగనాథంగాడికి యిల్లాంటి దే తయారైంది.

కరు—అదేమిటి ?

రామం—అదో గాథ లే! ఖర్మం చాలక ఏదో అమ్మాయికి వుత్తరం రాశాడు, అది వేరే అమ్మాయికి అందింది. వెంటబడుతుంది. "నీకు కాను వుత్తరం రాశిందం" టు వినదు.

(లోపల్నుంచి, రామం ఇలారా అని రంగనాథం కేక లేస్తాడు)

రామం—ఆ. వస్తున్నా (వెళతాడు)

[కరుణాకరం అటూ ఇటూ తిరుగుతుండగా రామం తిరిగి ఒక Photo తో తిరిగి వచ్చి]

రామం—ఇదిగో ఈ Photo కోసం పిల్చాడు. (అని Drawer లోంచి Photo తీస్తాడు)

కరు—ఏం Photo!

రామం—ఇదిగో! ఈ అమ్మాయిని వాడు Love చేశాడులే. ఇది Fail అయింది. ఈ అమ్మాయికి రాసిన వుత్తరం కుర్ర వెధవ యింకో అమ్మాయికిచ్చి మా కొంపదీశాడు. ఇది చూపించి తన వుత్తరం యీ అమ్మాయికని నమ్మించి వదిలించుకుందామని వాడి వుద్దేశ్యం. పోదొచ్చివస్తా. (వెళతాడు)

[కరుణాకరం అటూ యిటూ తిరుగుతుండగా బయట నుంచి కుర్రవాడొస్తాడు]

కుర్ర—ఏరండీ వారూ

కరు—ఆలోపలున్నారు.

కుర్ర—(రంగనాథం గదిలోకి వెళ్తాడు.)

[కరుణాకరం మళ్ళీ తిరుగుతుంటాడు. కొత్తాయన పోలీసుతో వస్తాడు]

కొత్త—ఏరీ! ఇక్కడ లేరే

పోలీ—ఈయనా!

కొత్త—ఈయనగాదు; ఏమండీ! ఇక్కడిద్దరు కుర్రవాళ్ళుండాలి. ఏరండీ.

కరు—ఆ గదిలో వున్నారు.

కొత్త—అ. (అని వెళ్ళి తలుపు దగ్గరనుంచుని) ఏదో పని మీదున్నట్టున్నారే!

కరు—ఆ - పనిమీదే వున్నారు.

కొత్త—ఏం పని?
కరు—ఏమో.
కొత్త—కాస్త పిలవండి.
కరు—మీరే పిలవండి.
కొత్త—అహా; ఎవరిదో ఆడ గొంతుక వినిపిస్తోందండీ-అందు
వని - మిమ్మల్ని పిలవమంటున్నాను.
కరు—అందుకే నేను మిమ్మల్ని పిలవమంటున్నాను.
పోసి—పోదాం పద లోపలికి
[పోసు, కొత్తయ్యన - లోపలికి పోతారు కరుణా
కరం అటూ ఇటూ తిరుగుతూంటుండగా మధ్య ద్వారంలోంచి
రమ వస్తుంది ఖంగారుగా Photo పట్టుకుని]
రమ—మీరెవరో వున్నారే - యిక్కడ; నే మళ్ళీవస్తానని
చెప్పండి; మీరు రంగనాథం స్నేహితులేనా? - ఆ.
కరు—ఆ.
రమ— మా Father యీ సమయానికే వచ్చారు; ఆగది
లోంచి తిరిగి యిటువచ్చా. వస్తానని చెప్పండి; ఈ Photo
వారి కివ్వండి.
[ఇస్తూవుండగా - సరళ వస్తుంది. రమ వెళ్ళిపోతూ]
రమ— నేను మళ్ళా వస్తాను సాయంత్రం అని చెప్పండి.
సరళ—(వాళ్ళిద్దర్నీ చూసి చిన్నబుచ్చుకుని) రంగనాథం
గారు లేరండీ?
కరు—(తెల్ల మొహంతో) ఉన్నారు.

సర—ఎక్కడ

[కరుణాకరం లోపలికి వెళ్తున్నాడు. సరళ లోపలిక వెళ్తుంది. కరుణాకరం తన చేతిలో వున్న Photo వంకా, ఆ అమ్మాయివంకా నాలుగైదు సారులు చూస్తాడు. కుర్రవాడు లోపల్నించి వస్తాడు]

కుర—మీరిక్కడే వున్నారేమిటి ?

కరు—ఊఁ ?

కుర—లోపలికి వెళ్ళండి.

కరు—ఊఁ.

కుర్రా—లోపల బలే ఫార్సుగా వుందండి! ఆ అమ్మాయి మాట్లాడుతుండగా – ఆ అమ్మాయి తండ్రి వచ్చాడు. అటునించి ఆ అమ్మాయి యిటు వచ్చేసింది. ఆ అమ్మాయి ఇటు రాంగానే – యిటు ఇంకో అమ్మాయి వచ్చింది. ఈ అమ్మాయిని చూశారూ ?

కరు—ఆ...ఆ.

[వెంకట్రామయ్య వస్తాడు]

వెంక—రంగనాథం ఉన్నాడండీ ?

కరు—ఉన్నాడు.

కుర—ఉన్నారు – ఉన్నారు, ఆ గదిలో – వెళ్ళండి వెళ్ళండి.

వెంక—(కరుణాకరాన్ని గుర్తించి) ఎప్పుడొచ్చావ్ –కరుణాకరం ?

కరు—ఇప్పుడే...

వెంక—ఇంటికి రాలేదేమోయ్ - ఫ్రాళ్ళొకొచ్చి. ఇక్కడే దిగావా ?

కరు—లేదు. Hotelల్లో దిగా.

వెంక—అదేమిటోయ్ - ఫ్రాళ్ళొకొచ్చి కూడా మా ఇంటికి రాకుండా...

కరు—ఏం లేదు.

వెంక—వీళ్ళు నీ స్నేహితులా ఏం ?

కరు—ఎవరూ ?

వెంక—ఈ రంగనాథం వాళ్ళూ.

కరు—అవును.

వెంక—ఏరీ - రంగనాథం వాళ్ళూ ?

కుర్రా—లోపలున్నారు.

వెంక—ఉండు వస్తా. ఇంటికి వెళ్దాం. (లోపలికి పోబోగా)

కరు—ఆగండి!

వెంక—లోపలికి వెళ్ళటానికి వీల్లేదూ !

కరు—నేను మీతో మాట్లాడాలి.

వెంక—ఏమిటీ !

కరు—ఈ Photo మీ అమ్మాయి దేగా ! (అని రమ యిచ్చిన Photo చూపిస్తాడు)

వెంక—ఆ !

కరు—ఇది ఈ రంగనాథానికెలా వచ్చింది ?

వెంక—రంగనాథానికా ?

కరు—ఆ! రంగనాథానికే?

వెంక—ఇది రంగనాథం దగ్గరుందా!

కరు—ఉంది. ఎందుకుందో మీకు తెలుసా?

వెంక—అదే! ఎందుకుందా అని?

కరు—మీకు తెలియదేమో! నాకు తెల్సు. మీఅమ్మాయి రంగనాథాన్ని ప్రేమించింది.

వెంక—ఆ...ఆ!

కరు—అందుకనే యీ Photo వుంది.

వెంక—అహా!

కరు—ఆ అమ్మాయిని నా కిచ్చి చేద్దామనుకున్నారు... మీరు.

వెంక—నిజమే. మరి ప్రేమిస్తే నిన్ను చేసుకుంటానని నప్పుకుందేం?

కరు—అదే - నేను మిమ్మల్ని అడుగుతున్నా.

వెంక—ప్రేమించందే - ఒప్పుకుంటుందంటావా?

కరు—ఒప్పుకోవచ్చు - నా ఆస్తి - అదీ చూసి...

వెంక—ఏమో బాబూ! మీ కుర్రకారు మనస్సులో వుండే దొకటి? పైకి చెప్పే దొకటి?

కరు—అనే నేనూ నిర్ధారణకి వచ్చాను. కనక మీ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోను.

వెంక—ఆ. పెళ్ళిచేసుకోవ్వూ?

కరు—అహా! కావాలంటే మీ అమ్మాయికి వేరే పెళ్ళిచేసుకోండి.

వెం—ఎవరి కివ్వను ?

కరు—ఈ రంగనాథానికే యివ్వండి – మీ కిష్టమైతే.

వెంక—నా కిష్టంలేదుగా !

కరు—మీ అమ్మాయికి యిష్టమే.

వెంక—అదీ లేదు.

కరు—ఉన్నదో – లేదో! నాకెందుకు? నా కక్కర లేదు.

వెంక—అహా ! అక్కర్లేకపోవటానికి కారణం ఏమిటో అని ?

కరు—కారణాలు లక్ష వున్నాయ్ – కాని అవ్వన్నీ స్వంత కారణాలు. మీకు చెప్పక్కర్లే.

వెంక—అల్లాగా ?

కరు—మీ అమ్మాయి రంగనాథాన్ని ప్రేమించటం చాలు నేనక్కర లేదంటానికి.

వెంక—మా అమ్మాయి మొదట తొందరపడి ప్రేమించిన మాట నిజమే. కాని తర్వాత ఆలోచించి హంసపాదు పెట్టేసింది.

కరు—ఏమో! అదంతా నాకెందుకు? కావాలంటే మీ అమ్మాయీ రంగనాథం లోపలున్నారు. వెళ్ళి సంప్రదించండి.

వెంక—లోపలున్నారా? అరే! ఎందుకొచ్చింది?

కరు—ఏమో! వెళ్ళి కనుక్కోండి.

(వెంకట్రామయ్య ప్రక్కగది లోపలికి వెళతాడు)

[కరుణాకరం అటూ ఇటూ తిరుగుతాడు. ఆ దర్వాజా దగ్గరికి వెళ్ళేటప్పటికి, లోపల్నించి చాలా గోలగానూ,

అందరూ ఒక్కసారే మాట్లాడుతున్నట్లు, వినిపిస్తోంది. కరుణాకరం వెనక్కి వచ్చేస్తాడు. కొంతసేపటికి కుర్రవాడు వస్తాడు]

కుర్ర—ఇదేమిటండీ? అందరూ అక్కడుంటే మీరిక్కడున్నారూ...?

కరు—అందరూ అంటే - ఎవరెవరు?

కుర్ర—రామం; రంగనాథంగార్లూ; రంగనాథంగారు ప్రేమించిన అమ్మాయి; ఆ అమ్మాయితండ్రి; రంగనాథంగారు ప్రేమించని అమ్మాయితండ్రి; ఆయన తీసుకొచ్చిన పోలీసు...

కరు—ఏంచేస్తున్నారు - ఇందరూకలిసి?

కుర్ర—ఒకళ్ళమాట ఒకరు వినిపించుకోకుండా కేకలేసుకుంటున్నారు. బలే తమాషాగా వుంది. వెళ్ళిరండీ - లోపలికి; మీరూ చూసిరండి.

కరు—వద్దులే.

కుర్ర—వద్దంటారేమిటి? - లోపల, ఓ-మోతగావుంటే!

(లోపల్నించి కేకలు ఎక్కువగా వినిపిస్తాయి)

కుర్ర—కొట్లాటదాకా వచ్చేట్టుంది: ఆగండి. (వెళ్తాడు)

(కరుణాకరం అటూ ఇటూ తిరుగుతాడు. రమవస్తుంది)

రమ—అందరూ వెళ్లారాండీ?

కరు—లేదు...

రమ—ఏరీ - మరి?

కరు—లోపలున్నారు - అదేం - గోలా!

రమ—అందరూ ఉన్నారా?

కరు—ఆ! మీరూ వెళ్ళవచ్చు, లోపలికి...

రమ—వద్దులెండి; నే వెళతా?

కరు—ఎందుకొచ్చారు - వెంటనే వెళ్ళడానికి?...

రమ—అదోగాథలెండి; వీళ్ళు ఎవరో అమ్మాయికి రాశిన ఉత్తరం నాకందింది. దానివిషయాలు నాలుగూ అడిగి పోదామని వచ్చా - కాని - ఇంతలో మానాన్నగారు కూడా యిక్కడికి వచ్చారు. అందుచేత ఇందాకా రండే అడిగాను. తతిమ్మావి అడిగిపోదామని మళ్ళీ వచ్చా.

కరు—ఇక మీరేం అడగక్కర్లేదు. అడగాల్సినవన్నీ అందరూ నిలవేసి అడుగుతున్నారు.

రమ—ఎవరూ?

కరు—రంగనాథం ప్రేయసీ - ఆమెతండ్రి; సీతండ్రి-అందరూ కలిసి అడుగుతున్నారు.

రమ { అడగాల్సిందే - అడగాల్సిందే......
వెధవ వుత్తరాలు రాస్తుంటే అడగాల్సిందే మరి.
నిజంగా ప్రేమవుంటే రాశినా ఫర్వాలేదు.

కరు—అవును.

రమ—ప్రేమించి పెళ్ళిచేసుకుంటే ఉత్తరాలు రాసినా తప్పు లేదు.

కరు—మరే!

రమ—ప్రేమలేక పెళ్ళిలేక - వుత్తరాలురాస్తే - ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?

కరు——ఏమైనా అనుకుంటారు.

రమ——అందులో పెళ్ళికావాల్సిన పిల్లనాయె?

కరు——ఆ.

రమ——ఈ ఉత్తరాలు 'నాకొస్తున్నాయి' అని తెలిస్తే - ఎవరన్నా పెళ్ళిచేసుకుంటారూ - నన్ను?

కరు——చేసుకోరు.

రమ——అవి నాకొద్దనీ - మరెవరికోననీ, తెల్సిన మీలాంటి వాళ్ళయితే ఫర్వాలేదు - చేసుకుంటారనుకోండి.

కరు——కాదూ, మరి...

రమ——మీలాగ ప్రేమంటే తెల్సినవాళ్ళయితే ఎల్లాగన్నా సర్దుకుపోతారు.

కరు——తప్పకుండా!

కరు——మీరే నన్ను ప్రేమిస్తున్నారనుకోండి; ఈ ఉత్తరాలు చూసి అపోహపడతారా?

కరు——అబ్బే.

రమ——అట్టే చూస్తుంటే - మీరిదివరకే నన్ను ప్రేమించినట్టున్నారే?

కరు——అబ్బే! లేదు.

**రమ**——అహా! మీ కళ్ళే చెప్తున్నాయి.

కరు——ఏమని?

రమ——నిన్ను నేనిందాకే ప్రేమించానని.

కరు——అల్లాగా!

రమ—ప్రేమిస్తే ప్రేమించండి గాని - ఉత్తరాలు రాయకండి.

కరు—అదేమిటి?

రమ—అవి ఎవరికన్నా చేరితే కష్టం; కావాలంటే నచ్చి కాలేజీ గేటుదగ్గర కన్పించండి.

కరు—కనిపించనా?

రమ—ఆ - రోజూ కనిపించవచ్చు! చక్కగా మాట్లాడుకుని యింటికి వెళ్ళవచ్చు.

కరు—పోనీ - అల్లాగే.

రమ—మీకు బాగా ఆస్తి వుందా?

కరు—ఉంది.

రమ—ఉంటే మానాన్న ఏమీ అనడు. కావాలంటే పెళ్ళి చేసుకోవచ్చు.

కరు—అయితే - అదే బాగుంది.

రమ—బాగుంటే - పోదాం రండి; అన్నీ చక్కగా మాట్లాడుకుందాం.

కరు—వస్తా. కాని ఇక్కడ కాస్త పనుంది. సాయంకాలం నీకోసం వేచుకు వుంటాలే.

రమ—అల్లాగే, తొందరలేదు. సాయంకాలం సావకాశంగా కూడా వుంటుంది. మరి నే వస్తా; మర్చి పోకండి.

కరు—అబ్బే! ఎట్లా మర్చిపోగలను?

రమ—సరే అయితే జ్ఞాపకం వుంచుకోండి, (రమ వెళ్ళబోగా కరుణాకరం వెళ్తున్న రమను ఆపి)

కరు—మాట మాట - నీ పేరేమిటి?

రమ—ఎందుకు?

కరు—పేరు తెలియకుండా ఎట్లా ప్రేమించను?

రమ—"రమ". వస్తా-వస్తారుగా? (వెళుతుంది)

[కరుణాకరం అటు యిటూ తిరుగుతాడు; కుర్రాడొస్తాడు]

కుర్ర—ఒంటరిగా మీకిక్కడేం తోస్తున్నదండీ - లోపల అంత గంద్రగోళం జరుగుతుంటే

కరు—ఏం జరుగుతోందేం?

కుర్ర—ఓ! రామ రావణ యుద్ధం!

కరు—అహా!

కుర్ర—మొదట ఆ కొత్తమ్మాయి వచ్చి దెబ్బలాడింది. ఆమె వెనకే ఆమె తండ్రి పోలీసుతో సహావచ్చి తెగ దెబ్బలాడారు. "మీ అమ్మాయికి కాదయ్యా మేం రాసింది" అని, రంగనాథంగారు, రామంగారూ - గోల. తర్వాత ఆ అమ్మాయి "నా కుత్తరం రాశారూ! - పెళ్ళిచేసుకో" అని. ఆ వెనకనే వాళ్ళ నాన్న "ఛత్ ఈ వెధవలికి నాపిల్ల నిస్తానా అని". అబ్బో! చాలా బాగుందిలెండి. అందులో ఆ రెండో పిల్ల తండ్రి మరీను.

[కొత్తాయన, పోలీసు వస్తారు]

కొత్తా—ఆ ఉత్తరం ఇచ్చారా-లేదా? మా అమ్మాయికి?

పోలీ—ఇచ్చారు.

కొత్తా—ఎందు కివ్వాలి?

పోలీ—అది పొరపాటంటున్నారుగా!

కొత్తా—పొరపాటని నన్నూరుకోమంటావా?

పోలీ—ఊరుకోక?

కొత్తా—చాల్లే - ఎప్పు మాట్లాడావ్!

పోలీ—మరెల్లా?

కొత్తా—ఎల్లాగేమిటి పోలీసువాళ్ళం - ఉత్తరాలు రాస్తే వూరుకోమంటావా?

పోలీ—ఆ ఉత్తరం - నీకు కాదంటుంటే -

కొత్తా—అందుకోనా ఎదరైనా ఇవ్వటం?

పోలీ—నీక్కాదుగా!

కొత్తా—పైగా ఉత్తరం నడిగినకోనా ఇవ్వటం.

పోలీ—అయితే ఏం?

కొత్తా—ఏం ఏమిటి? అసలు ఎందుకివ్వాలి?

పోలీ—నీక్కాదంటే వినవే- చూడండీ!

కరు—ఇదేమిటండీ? లోపల్నించి వచ్చి బయట దెబ్బలాడుతున్నారు!

పోలీ—లోపల దెబ్బలాడటానికి వీలుగా లేక...

కొత్తా—చూడండి! ఈ లుచ్ఛాలను వెనకేసుకొస్తాడు - నా వెనక వచ్చి.

కరు—ఏ లుచ్ఛాలూ?

కొత్తా—ఈ ఇల్లు అద్దెకు తీసుకున్న లుచ్ఛాలు.

కరు—ఏం చేశారు.

కొత్తా—ఏం చెయ్యాలి ? పరువుగా తిరిగే ఆసామీలు కి వృత్త
రాలు రాశారు.

పోలీ—అగే...మళ్ళా...

కొత్తా—నువ్వూర్కోర్కో. రాసి - మళ్ళీ మా అమ్మాయికి
కాదంటున్నారు.

పోలీ—అంటూ రేమిటి కాదు.

కొత్తా—కాదంటే నేనొప్పుకోను; కాదని మా అమ్మాయి
ఒప్పుకున్నా నే నొప్పుకోను. నువ్వొంటే నవ్వుకుంటూనా-?

పోలీ—(నవ్వుతాడు)

కొత్తా—నవ్వుతావేం - పోట్లాట చేతకాక...

కరు—మీ అమ్మాయికి కాదంటున్నారుగా! పొరపాటై
ఉంటుంది. పోనీయండి.

కొత్తా—నువ్వూ పోనీయండంటావ్ ?

కరు—ఆ; మరి - అనవసరంగా దెబ్బలాట లెందుకు ?-

కొత్తా—అనవసరం అనవసరం! అనవసర మేమిటయ్యా జ్ఞానం
లేకుండా ప్రవర్తిస్తుంటే...?

కరు—ఆ

కొత్తా—వాళ్ళకి బుద్ధిలేకపోతే నీ కుండక్కర్లే?

కరు—ఏమండోయ్ ! కాస్త మాటలు జాగ్రత్తగా రానీ
యండి.

కొత్తా—రానిస్తాం. ఆగు - మీ అందరి పని చెప్తా మా బావ
మరిదితో చెప్పి.

కరు—చెప్తే చెప్పు. ఏం–మీ బావమరిది తల కొట్టి మొలేస్తాడా?

కొత్తా—మొలేస్తాడో లేదో చూద్దూగాని మా బావమరిది ఎవరో తెలుసా!

కరు—ఎవరేం!

కొత్తా—Head Constable

పోలీ—ఏమిటంది?

కొత్తా—నువ్వాగు...

పోలీ—ఇక పోదాం రా!

కొత్తా—నే రాను.

పోలీ—రావాలి – నీ మతిపోయింది – రా. (పట్టుకు లాగుతాడు).

కొత్తా—అరే! లాగుతావేం – వదులు...

పోలీ—పోదాం, రా.

కొత్తా—రాను. ఒదులు– వదలవేం? – వదలమంటే!–అరే, ఒదులుతావా – వదలవా?– వదలవా? ఆగు – నీ పని మా బావమరిదితో చెప్పి......

పోలీ—(వొదిలి, నవ్వుతాడు)

కొత్తా—నవ్వుతావేం?

పోలీ—అరే! నేనే కామురా – నీ బావమరిదిని? పద...

కొత్తా—రాను. ఈ సంగతి తేల్చందే చస్తే రాను.

పోలీ—అయితే తేల్చు, – నే పోతున్నా.

కొత్తా—పోతే, పో...

పోలీ—దెబ్బలు తగిలితే, నా దగ్గరకురా; ఆస్పత్రికి తీసి
కెళతా, (వెళతాడు)

కొత్తా—చూడండీ! మా అమ్మాయి చాలా మంచిది.
వీళ్ళ ఉత్తరం నలిపి నేలకు కొట్టింది.

కరు—అయ్యో వుంటుంది.

[వెంకట్రామయ్య రంగనాథంతో వస్తాడు]

వెంక—నే నీ పెళ్ళికి చస్తే వప్పుకోను.

రంగ—ఒప్పుకోవద్దు.

వెంక—ఒప్పుకోకపోతే పెళ్ళి ఎట్లా అవుతుందో చూస్తా!

రంగ—ఎట్లా అవదో.. నేనూ చూస్తా!

వెంక—నేను సరళ తండ్రిని -

రంగ—నిశ్చయంగా!

వెంక—సరళ నాకొక్కగాను ఒక్క పిల్ల -

రంగ—నిశ్చయంగా!

వెంక—సరళ పెళ్ళి నా యిష్టప్రకారం జరగాలి.

రంగ—సరళ యిష్టప్రకారంగా జరగాలి.

వెంక—నే తెచ్చిన సంబంధం సరళ కష్టమే.

రంగ—అదంతా నాకు తెల్సు.

వెంక—నే తెచ్చిన పెళ్ళే చేసుకుంటానని ప్రమాణంకూడా
చేసింది.

రంగ—అవునట -

వెంక—అప్పుడే - నువ్వు వుత్తరం రాశావ్!

కొత్తా—అది మా అమ్మాయికిగా!

రంగ—పై సంగతి తెలియక వ్రాశాను.

వెంక—అవ్విచూసే - మా అమ్మాయి మనసు మార్చు కుంది.

రంగ—అందుకు నే బాధ్యుణ్ణి కాదు.

వెంక—కాకపోవటమేమిటి? మా అమ్మాయి మనసు మార్చి వేసి!

రంగ—నే మార్చలా! మీ అమ్మాయే మార్చుకుంది.

వెంక—కాదు. నువ్వే మార్చావ్.

రంగ—కాదు

వెంక—అవును.

సరళ—(వస్తూ) కాదు నాన్నా! నా మనసు నేనే మార్చు కున్నాను.

వెంక—ఏమిటే?

సరళ—మొన్న నీ మాట విని, నా మనసు మార్చుకుని, నీవు కుదిర్చిన పెళ్ళికి ఒప్పుకున్నా.

వెంక—అవును.

సర—నిజానికి ఇందాక వచ్చి నన్ను మర్చి పొమ్మని చెప్పి వెళ్ళా రంగనాథంతో—

వెంక—ఆ. మరి.

సర—ఇహ - రంగనాథాన్ని ప్రేమించినవాణ్ణే మర్చి పోదామనుకున్నా.

వెంక—అట్లాంటిది ఇప్పుడిదేమిటి?

సరళ—నువ్వు చెప్పిన ఆయన్నే మనస్ఫూర్తిగా ప్రేమిద్దాం అనుకున్నా-

వెంక—ఇంకేం - ప్రేమించు.

సరళ—రంగనాథం దగ్గర నా Photo వుంటే పోయింది. అది కూడా తీసుకు వెళ్ళిపోదామని వచ్చా.

వెంక—ఇక్కడికి - ఆ.

సరళ—అప్పుడే. వీరిని (కరుణాకరంను చూపించి) ఇక్కడ చూశా!

వెంక—అహా! చూశి,

సరళ—ఆయనతోబాటు మరో అమ్మాయి గూడా వుంది.

వెంక—ఇక్కడా!

కొత్తా—ఇంకో అమ్మాయా!

సరళ—ఆ అమ్మాయి ఈయనికి వక Photo కూడా ఇస్తోంది.

వెంక—తన Photo! అహా!

సర—అది చూశి - ఇద్దరూ నవ్వుకుంటున్నారు.

వెంక—అహా - అరే!

సరళ—అదిచూశి నా మనసు మళ్ళీ మార్చుకున్నా.

వెంక—అదా!

కొత్తా—మార్చుకోవాల్సిందే!

సరళ—మళ్ళీ అన్నివిధాలా రంగనాథమే, మంచివాడని నిర్ధారణ చేసుకున్నాను.

గంగ—కాని సరళా తొందర పడకు. బాగా ఆలోచించుకో.

సరళ—ఏమిటే!

రంగ—అతను B. A. Pass అయ్యాడు.

సరళ—పెళ్ళయితే నువ్వూ Pass అవుతావు.

గంగ—అతనికి పినతండ్రి చచ్చిపోతే ఆస్తి వచ్చింది.

సరళ—ఎవరూ పోకుండానే నీకూ ఆస్తివుంది.

రంగ—అతను విరహ గీతాలు రాస్తున్నాడు.

సరళ—అవ్వి మరెవరికన్నా పంపుకుంటాడు.

వెంక—ఎక్కడికి పంపుతాడు? ఎక్కడికీ పంపడు.

కరు—ఎక్కడికో అక్కడికి - పంపుతాడు లెండి.

వెంక—ఎటూ కాకుండా - అమాంతంగా, ఎక్కడికి పంపుతావయ్యా?

కరు—ఎక్కడికైతే ఏం? నా తంటాలు నేపడి పంపుకుంటా!

సరళ—చూశారా ఎక్కడికి పంపుతాడోకూడా అప్పుడే నిశ్చయమై పోయింది.

వెంక—వేరే నిశ్చయంగూడా చేసుకున్నావా!

కరు—ఆ.

సరళ—నే చెప్పింది నిజమేగా! ఇక ఎవరోకూడా కనుక్కోండి.

కరు—ఎవరయితే ఏం? నిశ్చయమై పోయింది.

సరళ—చెప్పకపోతే మాకు తెలియదా! ఇందాకటి అమ్మాయికే?

రంగ—అయితే - ఈయన సరళకు కుదిర్చిన సంబంధం బాపతువాడివి నువ్వా?

కరు—ఆ - నేనే.

వెంక—(కొత్తాయనతో) చూశారా! ఈరోజుల్లో కుర్రకారు మనసు కనిపెట్టటమే కష్టమైపోతోంది.

కొత్తా—అందరూ మీ అమ్మాయలాంటివాళ్లయితే కష్టమే. కాని మా అమ్మాయి ఇలా ఎప్పుడూ చేయదు.

సరళ—ఎవరయినా ఇంతేచేస్తారు.

వెంక—ఇంతకూ యిప్పుడేమిటీ చెయ్యటం? కరుణాకరం! ఇహ నీ ఆశ వదులుకోటమేనా?

కరు—నా ఆశ మీ కెప్పుడో పోయింది.

కొత్తా—ఇక వున్నది ఇదొక్కటే కాబట్టి మీ అమ్మాయిని ఈ రంగనాథానికిచ్చి పెళ్ళి చేసెయ్యండి. ఇహ ఉత్తరాలు రాయకుండా వుంటాడు.

వెంక—అదేమిటి? అతను ఎవరికో ఉత్తరాలు వ్రాస్తే నాకేం?

కరు—పోనీ అన్ని ఉత్తరాలూ మీ అమ్మాయికే వ్రాస్తాడు. పెళ్ళి చేయండి.

వెంక—అదే పనికరాదు. ఇక ఉత్తరం వచ్చిందంటే వూరుకునేది లేదు. వెధవ వుత్తరాలు రాసి శుభ్రమైన సంబంధం చెడగొట్టాడు. సరళా! ఇక యీ వ్యవహారానిక Full Stop పెట్టెయ్యి. జరిగిన గోలంతా చాలు. ఇకపద-యింటికి.

సరళ—వస్తాను కాని......

వెంక—కానీ ఏమిటింకా? ఈపెళ్లి కాకపోతే మరొకటి.

కొత్త—కాని-ఈ రంగనాథాన్ని పెళ్ళి చేసుకోవాలని వున్నట్టుంది. మీ అమ్మాయికి.

వెంక—ఉంటుంది. ఈ రంగనాథం బదులు మరో అనాథుణ్ణి చూస్తున్నా అలాగే వుంటుంది. ఇక నడు యింటికి.

సరళ—నాన్నా!

వెంక—నోరుముయ్యి! ఇంటికినడు.

రంగ—సరళా. ఆగు. ఆయన వద్దంటు అన్నాడు. మరేం ఫర్వాలేదు. నువ్వు ఉండిపో.

సరళ—ఉండిపొమ్మంటావా?

వెంక—సరళా!

[సరళ యిద్దరవంకా చూస్తూంది. ఎటూ తేల్చుకోలేక బాధపడి చివరకు :—]

సరళ—వద్దులే రంగనాథం! మనయిద్దరికీ ఎప్పటికో అప్పటికి ఏదో వక పెళ్ళి కాకపోతుందా. ఇందుకోసం అయిన వాళ్ళతో విరోధం కొని తెచ్చుకోవటమెందుకూ? కొన్నాళ్ళి పాటిట్లా విచారంగా వున్నా నెమ్మదిమీద సర్దుకుంటుం దిలే. ఈ విచారంతో తొందరపడి ప్రమాదపు పనులేం చెయ్యకు. బ్రతికినన్నాళ్ళు బాగా వుండు. ఎట్లావున్నా ఉత్తరాలుమాత్రం వ్రాయకు. వస్తా. (వెంకట్రామయ్యా - సరళా వెళ్ళిపోతారు)

కొత్త—అయితే ఇంతేసన్నమాట. మా అమ్మాయి అయితేనా - వకసారి ప్రేమించిన తర్వాత వదిలిపెడ్తుందా! వస్తా. (వెళ్ళబోగా)

కరు—ఎందుకూ - ఇక నేనూ వెళ్తా - వీళ్ళ వెనకే:

కొత్తా—ఏమన్నారూ? వెనకనే వస్తారా?-

కరు—ఆ. వస్తా.

కొత్తా—ఎందుకూ నా వెనకనే రావటం?

కరు—ఏంవస్తే?

కొత్తా—వెనకనే ఎందాకా వస్తావ్?

కరు—ఎందాకానో ఎందుకు వస్తాను! మా Hotel దాకా వస్తా.

కొత్తా—Hotel దాకా వస్తే వచ్చావ్! మా యింటిదాకా వచ్చావంటేనా?...జాగ్రత్త (వెళ్తాడు)

కరు—పో - పోవయ్యా! పిల్ల నిస్తానన్నా నీ వెనకరాను.

[కుర్రాడు వస్తాడు]

కుర్ర—(వచ్చి) అందరూ వెళ్ళారాండీ.

కరు—ఇంకా నేను వెళ్ళలే.

కుర్ర—రామంగారు, అందరూ వెళ్ళారేమోచూశిరమ్మన్నారండి.

రంగ—ఏడీ! వాణ్ణి రమ్మను, (కరుణాకరంతో) నువ్వా ఈ సమయానికి వచ్చావేంరా?

కరు—ఈ సరళతో పెళ్ళి తప్పించుకోవాలనే!

ంగ—ఏమల్లా?

సు—ఏం లేదు. ఈ వెంకట్రామయ్య గారొచ్చి మా పిం
తల్లితో పెళ్ళి సంబంధం మాట్లాడారు. మా పినతల్లిని
. కాదనలేక తల వూపాను. తర్వాత ఈయన పెళ్ళికూతురి
Photo కూడా పంపాడు. ఆ Photo లో ఈ పిల్లబొమ్మ
బాగా లావుగా అసహ్యంగా పడ్డది. అది చూశి మా
పినతల్లి "ఛ- ఛ ఈ పిల్ల నువకొద్దు" అంది. ఈ సంబం
ధం ఎల్లాగన్నా తప్పించుకు రమ్మని నన్ను పంపింది;
బయిలుదేరి సరాసరి ఇక్కడికి వచ్చాను.

ంగ—ఇక్క డిట్లా అయింది.

[రామం ప్రవేశిస్తాడు]

ామం—(వచ్చి) అమ్మయ్యా. అంతా తేలిపోయింది. సరే.
ఇక నీ గొడవ చెప్పబ్బాయ్.

(కొత్రవాడొచ్చి బయటకి వెళతాడు)

ంగ—మన గొడవతో బాటు వాడి గొడవా తేలిపోయిందిలే.

ామం—ఎట్లా?

ంగ—ఈ సరళనే నా కిస్తామన్నారు.

ామం—అహా!

ంగ—నా పెళ్ళి సెటిలై - వాడి పెళ్ళి తప్పింది.

ామం—అరరరె.

సు—ఇక్కడికి రావటంవల్ల నా పెళ్ళి సెటిల్ అయింది.

ంగ<br>ామం }—ఏమిటీ?

కరు—నేనొక అమ్మాయినిచూసి పెళ్ళి నిశ్చయం చేసుకున్నాను.

రామం—ఏం తేలిగ్గా అయిపోతున్నాయిరా – పెళ్ళిళ్ళు!

[కుఱ్ఱవాడొచ్చి రహస్యంగా ఓ ఉత్తరం ఇస్తాడు రంగనాథం చదివి తెల్లబోయి]

రంగ—ఎవఱ్ఱా యిది? (అని రామం చేతికిస్తాడు, అతనూ తెల్లబోయి "ఎవరబ్బా" అని కరుణాకరం చేతికి యిస్తాడు)

కరు—ఇదా! అహా! (నవ్వి) Time అయిందిరా. త్వరగా వెళ్తా – ఈ ప్రాంతంలోవుంటే – ఎప్పుడన్నావొచ్చి కనిపిస్తాలే (పరుగెత్తుతాడు)

—: తెర :—

# UNIVERSITY OF HYDERABAD
## LIBRARY
HYDERABAD (A. P.)

*Cl. No.* T 82 G15T

*Acc. No.* 159334

**DATE DUE**

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

5 APR 1993

INDIRA GANDHI MEMORIAL LIBRARY

Acc. No. 154834

Call No. T 82 G15T

Author [illegible]

Title [illegible]

Title [illegible]

**UNIVERSITY OF HYDERABAD**

**INDIRA GANDHI MEMORIAL LIBRARY**

**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defacted or lost.

**Help to keep the book fresh and clean**